www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 8 | వెల రూ.5.00
Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar
హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 221 | శుక్రవారం | 24 జనవరి, 2025

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

## అమెజాన్ భారీ పెట్టుబడి

- రూ.60వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు అంగీకారం
- తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న దిగ్గజసంస్థ

హైదరాబాద్, జనవరి 23: పెట్టుబడుల వేటలో దావోస్‌లో సిఎం రేవంత్ బృందం బిజీగా ఉంది. వరుస భేటీలతో పలు కంపెనీలతో చర్చలు, ఒప్పందాలు సాగుతున్నాయి. తాజాగా తెలంగాణలో భారీ పెట్టుబడికి దిగ్గజ సంస్థ అమెజాన్ ముందు కొచ్చింది. దావోస్‌లో అమెజాన్ వెబ్‌సర్వీసెస్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్

మిగతా 2 లో




## ఎపి పిటిషన్‌పై ఫిబ్రవరిలో విచారిస్తాం

- కృష్ణా జలాల కేటాయింపు వ్యవహారంలో సుప్రీం ధర్మాసనం స్పష్టీకరణ

02





### పెట్టుబడుల్లో రికార్డు నమోదు చేసిన రేవంత్ బృందం

# 1.78 లక్షల కోట్లు

## దావోస్ వేదికగా తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ

### 10 సంస్థలో ఎంఒయూ చేసుకున్న ప్రభుత్వం

రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఇదే మొదటిసారి



దాదాపు నాలుగురోజుల పర్యటనలో సిఎం రేవంత్ బృందం బిజీగా గడిపింది. అనేక కంపెనీలతో చర్చలు జరిపి పెట్టుబడులను ఆకర్శించింది. తెలంగాణ రైజింగ్ నినాదాం బాగా కలసివచ్చింది. అలాగే హైదరాబాద్‌కు ఉన్న బ్రాండ్ ఇమేజ్ కూడా పనికి వచ్చింది. దీంతో పలు కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపాయి. ప్రధానంగా 6 ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు జరిగాయి.

- ఈ ప్రాజెక్టుల వల్ల సుమారు 49,550 మందికి ఉద్యోగాలు
- బాగా పనిచేసిన తెలంగాణ రైజింగ్ నినాదం
- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌తో మరింత ఆకర్శణ

**ప్రజానావ, హైదరాబాద్:** ప్రపంచ ఆర్థిక సదస్సు దావోస్ వేదికగా తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ పెట్టుబడుల రికార్డు నమోదు చేసింది. 16 ప్రముఖ కంపెనీలు సుమారు రూ.1.78 లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ప్రాజెక్టుల వల్ల సుమారు 49,550 మందికి ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, ఆశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు దావోస్ పర్యటనలో పాల్గొన్నారు. సన్ పెట్రో కెమికల్స్ సంస్థ భారీ పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటుకు ముందుకు వచ్చింది. నాగర్ కర్నూలు, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో ప్లాంట్లు. 3400 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో విద్యుత్తు ఏర్పాటు చేయనుంది. . 5440 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటు. రూ. 45,500 కోట్ల పెట్టుబడులు.. 7వేల ఉద్యోగాల కల్పనకు అవకాశం ఏర్పడింది.

మిగతా 2 లో



### మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం

- పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- నగరంలో పనులు ఆగిపోయాయన్న తలసాని
- కమిషన్ ఇలంబర్తిని కలసి వినతి పత్రం సమర్పణ

02

### రైతు మహా ధర్నాకు అనుమతి

బీఆర్ఎస్‌కు హైకోర్టులో ఊరట

02



### నేను తీసుకునే రెమ్యూనరేషన్ చాలా తక్కువ

- అది కూడా అంతా వైట్‌లోనే తీసుకుంటా
- నటుడు వెంకటేశ్ స్పష్టీకరణ

02



### మావోయిస్టుల పేల్చివేత కుట్ర భగ్నం

02



### హైదరాబాద్ ఆధారిత కంపెనీలతో దావోస్‌లో ఒప్పందాలా?

- ఇదేనా రేవంత్ ఇన్నోవేటివ్ ఆలోచన
- ట్విటర్ వేదికగా సీఎంపై కేటీఆర్ సెటైర్లు





### మంత్రి సీతక్క వ్యాఖ్యలతో పల్లెల్లో ఎన్నికల ఫీవర్

- ఏ నలుగురు ఉన్న చోట్ల ఎన్నికలపై చర్చ
- స్థానిక సంస్థల ఎన్నికలపై ఊహాగానాలు
- త్వరలో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు

03

### హామీల అమలులో తగ్గేది లేదు

- 26 నుంచి నాలుగు పథకాలు అమలు చేసి తీరుతాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ

03



# దావోస్ వేదికగా పెట్టుబడుల వెల్లువ



మొదటి పేజీ తరువాయి

అమెజాన్ వెబ్ సర్వీసెస్ ద్వారా ఏఐ, క్లౌడ్ సర్వీసెస్ డేటా సెంటర్లలో భారీ పెట్టుబడులు రానున్నాయి. రూ.60,000 కోట్ల భారీ పెట్టుబడికి అమెజాన్ ముందుకు రావడం విశేషం. ఇకపోతే కంట్రోల్ ఎస్ తెలంగాణలో అత్యాధునిక ఏఐ డేటాసెంటర్ క్లస్టర్ ఏర్పాటుచేయనుంది. 400 మెగా వాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. రూ. 10,000 కోట్ల పెట్టుబడితో 3,600 మందికి ఉపాధి దక్కనుంది. జేఎస్ డబ్ల్యు సంస్థ రాష్ట్రంలో మానవ రహిత ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. రక్షణ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు తెలంగాణ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు క్రియాశీలంగా మారనుంది. రూ.800 కోట్ల పెట్టుబడులు, 200 ఉద్యోగాలు దక్కనున్నాయి. స్కైరూట్ ఏరో స్పేస్ సంస్థ కూడా తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు కోసం రూ.500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఇకపోతే మేఘా ఇంజినీరింగ్ మూడు కీలక ఒప్పందాలు చేసుకుంది: రాష్ట్రంలో 2160 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ఇంధన ఉత్పత్తి ప్రాజెక్ట్. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ప్రాజెక్టు. అనంతగిరిలో వరల్డ్ క్లాస్ లగ్జరీ వెల్‌నెస్ రిసార్ట్ ఏర్పాటు చేయనుంది. రూ.15000 కోట్ల పెట్టుబడులతో , 5,250 మందికి ఉపాధి రానుంది. హెచ్‌సీఎల్ టెక్ సెంటర్ హైటెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. దీంతో. 5వేల మందికి ఉపాధి కలుగనుంది. హైదరాబాద్‌లో విప్రో కంపెనీ విస్తరణ చేపట్టనుంది.. గోపన్‌పల్లి క్యాంపస్‌లో కొత్త ఐటీ సెంటర్ ద్వారా 5వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. హైదరాబాద్‌లో ఇన్ఫోసిస్ క్యాంపస్ విస్తరణకు అంగీకరించింది. పోచారంలో ఐటీ క్యాంపస్‌లో కొత్త సెంటర్ ద్వారా రూ.750 కోట్ల పెట్టుబడులు.. 17,000 ఉద్యోగాలు దక్కనున్నాయి. ఇకపోతే యూనిలివర్ కంపెనీ కామారెడ్డి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ యూనిట్ ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలో బాటిల్ క్యాప్‌లను ఉత్పత్తి చేసే కొత్త తయారీ యూనిట్ ఏర్పాటుతో దాదాపు వెయ్యి మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ హైదరాబాద్‌లో అత్యాధునిక డేటా సెంటర్ ఎర్పాటుకు అంగీకరించింది. . 300 మెగావాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ ఏర్పాటుకు. రూ.15,000 కోట్ల పెట్టుబడులు పెటటనుంది. అమెరికాకు చెందిన కంపెనీ ఉర్సా క్లస్టర్స్ అత్యాధునిక అర్టిఫిషియల్ డేటా సెంటర్ హబ్‌ను స్థాపించనుంది. రూ. 5000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ప్రపంచ అగ్రగామి సంస్థ బ్లాక్‌స్టోన్ హైదరాబాద్‌లో 150 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం 4,500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. అక్షత్ గ్రీన్ టెక్ (మైత్రా ఎనర్జీ గ్రూప్ కంపెనీ) అత్యాధునిక సోలార్ సెల్స్, మాడ్యూల్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.7,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలో పేరొందిన ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ కంపెనీ దాదాపు 800 మంది ఉద్యోగులు పనిచేసేందుకు వీలుగా హైదరాబాద్‌లో నూతన కార్యాలయం ఏర్పాటుకు ముందుకు వచ్చింది. సంగారెడ్డిలో ప్రస్తుతమున్న సుహానా ప్లాంట్ పక్కనే కొత్తగా ఎక్సెలెన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. మొత్తంగా అనేక ఒప్పందాలు, పెట్టుబడులతో తెలంగాణ దావో వేదికగా మంచి స్పందనను సంపాదించింది. రేవంత్ రెడ్డి ప్రయత్నాలు ఫలించాయనే చెప్పాలి.

# రైతు మహా ధర్నాకు అనుమతి

## బీఆర్ఎస్ పార్టీకి హైకోర్టులో ఊరట



**ప్రజానావ, హైదరాబాద్ :** తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల వేళ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్ఎస్ పార్టీ భారీ రైతు మహా ధర్నా నిర్వహించేందుకు సిద్ధం కాగా.. పోలీసులు షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈనెల 21వ తేదీన నల్గొండ జిల్లా కేంద్రంలో ఈ రైతు మహా ధర్నాను నిర్వహించాలని.. ముందుగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సిద్ధం కాగా.. అందుకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో బీఆర్ఎస్ వర్గాలు తెలంగాణ హైకోర్టుకు ఎక్కారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. ఈనెల 28వ తేదీన రైతు మహా ధర్నా నిర్వహించుకునేందుకు బీఆర్ఎస్‌కు అనుమతులు ఇచ్చింది. దీంతో బీఆర్ఎస్ పార్టీ వర్గాలు సంతోషంలో ఉన్నాయి. ఈనెల 28వ తేదీన నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో రైతు ధర్నా నిర్వహించుకునేందుకు బీఆర్ఎస్ పార్టీకి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రైతు మహా ధర్నా నిర్వహించుకోవచ్చని హైకోర్టు తేల్చి చెప్పింది. ఇక బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే ఈ రైతు మహా ధర్నాకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఇతర నాయకులు హాజరు కానున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా.. కాంగ్రెస్ పార్టీ.. రాష్ట్రంలోని రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలోనే మొదట.. ఈనెల 21వ తేదీన ఈ రైతు మహాధర్నా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినా.. అందుకు పోలీసులు అనుమతించలేదు. అయితే జిల్లాల్లో ప్రస్తుతం గ్రామ సభలు, సంక్రాంతి రద్దీ కారణంగా బందోబస్తు ఇవ్వలేమంటూ నల్గొండ జిల్లా పోలీసులు ఈ రైతు మహా ధర్నాకు అనుమతి నిరాకరించారు. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నాయకులు.. ఈ రైతు మహా ధర్నా అనుమతి కోసం హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు.. బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు అనుమతిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# పడిపోతున్న ఉష్ణోగ్రతలు



**ప్రజానావ, ఖైరతాబాద్:** రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తగ్గి చలితీవ్రత నానాటికి పెరుగుతుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం వేళల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు చలికారణంగా గజగజ వణికిపోతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు జిల్లాలో దట్టమైన పొగమంచు కమ్మేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పొగమంచు కారణంగా యాదాద్రి, భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని కాల్వపల్లి వాగులో కారు ప్రమాదానికి గురైంది. పొగమంచు రోడ్డును కప్పేయడంతో వాగులోకి కారు దూసుకెళ్లింది. కారులో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డారు. విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.మేడ్చల్ జిల్లాలోని మేడిపల్లి మండలంలో ఉదయం 9 గంటల వరకు పొగమంచు దగ్గలేదు. వరంగల్ రహదారిపై రోడ్లు పొగమంచుతో వాహనాలు కనిపించక ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వాహనదారులు వాహనాలకు లైట్లు వేసుకుని వేగాన్ని తగ్గించుకుని ప్రయాణం చేశారు. హైదరాబాద్ నగరంలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పటాన్‌చెరులో 9.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. రాజేంద్రనగర్ 10.5, ఖమ్మంలో 18, రామగుండంలో 12.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెరిగిన చలి, కాలుష్యం వల్ల చిన్నారులు, వృద్ధులు శ్వాస సంబంధిత సమస్యలతో ఆసుపత్రుల పాలవుతున్నారు.

# సీఎం కీలక ప్రకటన

## డ్రైపోర్టు నిర్మించి మచిలీపట్నంకు అనుసంధానం చేయాలని నిర్ణయం

**ప్రజానావ, ఖైరతాబాద్:** తెలంగాణకు భారీగా పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా దావోస్ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం, అధికారుల బృందం.. అక్కడి పారిశ్రామిక వేత్తలను ఆకర్షించే పనిలో పడింది. ఈ క్రమంలోనే దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం, సీఐఐ, హీరో మోటార్ కార్ప్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ క్రమంలోనే రవాణా రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు బిజినెస్‌మెన్‌లు ముందుకు రావాలని కోరారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి అత్యున్నత ప్రమాణాలతో అభివృద్ధి చేయాలనే తమ రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇప్పటికే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌ను.. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన, పర్యావరణ అనుకూల నగరంగా మార్చేందుకు అందరు కలిసి కృషి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో డ్రైపోర్టును నిర్మిస్తామని దావోస్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ డ్రైపోర్టు నిర్మాణంతో తెలంగాణను వేర్‌హౌజ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. తెలంగాణకు తీరప్రాంతం లేని లోటును పూడ్చేందుకు.. కొత్తగా డ్రై పోర్టును నిర్మించి.. సమీపంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం పోర్టుకు ప్రత్యేకంగా రోడ్డు, రైలు మార్గాలతో దాన్ని అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు.

# మావోయిస్టుల పేల్చివేత కుట్ర భగ్నం

## 50 కిలోల మందుపాతరను నిర్వీర్యం చేసిన బలగాలు



**బీజాపూర్, జనవరి 23:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బాసగూడలో మావోయిస్టుల కుట్రను భద్రతా దళాలు భగ్నం చేశాయి. బాసగూడ–ఆవపల్లి మార్గంలో పోలీసుల వాహనాలను పేల్చేందుకు మావోయిస్టులు అమర్చిన 50 కిలోల మందుపాతరను సీఆర్‌పీఎఫ్ దళాలు నిర్వీర్యం చేశాయి. హైవేపై సొరంగం తవ్వి కల్వర్టు కింద మావోయిస్టులు మందుపాతర అమర్చినట్టు అధికారులు తెలిపారు. ముందుగానే గుర్తించి నిర్వీర్యం చేయడంతో ప్రమాదం తప్పిందని చెప్పారు. ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దులో ఇటీవల భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గరియాబంద్, నౌపాడ జిల్లాల్లో భద్రతాబలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో 20 మందికిపైగా మావోయిస్టులు మరణించారు. ఈ క్రమంలో మావోయిస్టుల కోసం పోలీసుల వేట కొనసాగుతోంది.

# మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం

## పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం

## నగరంలో పనులు ఆగిపోయాయన్న తలసాని

## కమిషన్ ఇలంబర్తిని కలసి వినతి పత్రం సమర్పణ



**ప్రజానావ, హైదరాబాద్:** మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానంపై శనివారం పార్టీ మీటింగ్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిశారు. కమిషనర్‌ను కలిసి హైదరాబాద్‌లోని ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై నేతలు వినతిపత్రం సమర్పించారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌తో గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు భేటీ అయ్యారు. కేవలం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను మాత్రమే ఛాంబర్ లోపలకు కమిషనర్ అనుమతించారు. ఛాంబర్ బయటనే బీఆర్ఎస్ కార్పొరేటర్లు వెయిట్ చేశారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... నగరంలో ప్రజలు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రజా సమస్యలపై కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. స్ట్రీట్ లైట్స్ ఎక్కడ వెలగట్లేదు, రోడ్లు సరిగ్గా లేవు అని చెప్పారు, ÷÷–ల ఓవర్లపై నిర్మాణాలు ఆగిపోయాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది ఏ పనులు చేయకపోయినా తాము సైలెంట్‌గా ఉన్నాం.. ఇకనుంచి ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. లక్షల సంఖ్యలో రేషన్ కార్డుల అప్లికేషన్లు వచ్చాయి.. దరఖాస్తు చేసుకున్న వారికి రేషన్ కార్డులు ఇవ్వాలని తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులకు సంబంధించిన ప్రోటోకాల్‌ను ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యేలకు చెప్పకుండానే శంకుస్థాపనలు ఎలా చేస్తున్నారని నిలదీశారు. అధికారులు తమ ఫోన్లు ఎత్తడం లేదు.. తమ నెంబర్లు బ్లాక్ చేస్తున్నారని ఆరోపించారు. వైకుంఠ ధామాల నిర్మాణాలు మధ్యలో ఆగిపోయాయని చెప్పారు. ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నా ఇన్నిరోజులు తాము ఎలాంటి ఆందోళన చేయలేదని అన్నారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో తమ పార్టీ సభ్యులే మెజార్టీ సంఖ్యలో ఉన్నారు.. అయినా తమ సభ్యుల ప్రశ్నలు ఎందుకు పట్టించుకోవడం లేదని తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు.

# చెక్ బౌన్స్ కేసులో రామ్‌గోపాల్ వర్మకు జైలు

**ముంబై,జనవరి 23 :** ప్రముఖ సినీ నిర్మాత, దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు చెక్ బౌన్స్ కేసులో ముంబై కోర్టు గురువారం నాడు మూడు నెలల జైలు శిక్ష విధించింది. ఫిర్యాదీ దారుకు రూ. 3.72 లక్షలు నష్టపరిహారంగా చెల్లించాలని కూడా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. రామ్ గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా స్పందించారు. అంధేరీ కోర్టు శిక్ష విధించిన విషయం పై వివరణ ఇచ్చారు. అతడు తన మాజీ ఉద్యోగి అని ఇది 7 ఏళ్లక్రితం కేసు అని తెలిపారు. అప్పట్లో 2.38 లక్షల రూపాయల చెక్కు బౌన్స్ అయిందని తెలిపారు. దీనిపై తన తరుపున న్యాయవాదులు కోర్టుకు హాజరవుతున్నారని అన్నారు.అందువల్ల తాను ఇక ఏమీ చెప్పలేరని తెలిపారు. కోర్టు ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

# అమెజాన్ భారీ పెట్టుబడి

మొదటి పేజీ తరువాయి





ప్రెసిడెంట్ మైకేల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రూ.60వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు అమెజాన్ అంగీకారం తెలిపింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం జరిగింది. ఈ పెట్టుబడితో రాష్ట్రంలో డేటా సెంటర్లను అమెజాన్ విస్తరించనుంది. వీటికి అవసరమైన భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మరోవైపు ఇన్ఫోసిస్ సీఎఫ్‌వో సంగ్రాజ్‌తో తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు భేటీ అయ్యారు. పోచారంలో ఐటీ క్యాంపస్ విస్తరణకు ఇన్ఫోసిస్ అంగీకారం తెలిపింది. రూ.750కోట్లతో మొదటి దశ విస్తరణ చేపడతామని ఆ సంస్థ తెలిపింది. దీంతో కొత్తగా 17వేల ఉద్యోగాలు రానున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. దావోస్ వేదికగా తెలంగాణలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ సంస్థ ఎంవోయూ చేసుకుంది. ఈ సంస్థ హైదరాబాద్‌లో 300 మెగావాట్ల డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్ ప్రెసిడెంట్ అహుజాతో జరిగిన భేటీలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ ఎంవోయూ చేసుకున్నారు. హైదరాబాద్‌లో రూ.4,500 కోట్ల పెట్టుబడులకు బ్లాక్‌స్టోన్ ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థ హైదరాబాద్‌లో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది.అమెరికా సంస్థ ఉర్స క్లస్టర్స్ తెలంగాణలో రూ.5 వేల కోట్ల పెట్టుబడికి ఒప్పందం చేసుకుంది. మంత్రి శ్రీధర్ బాబుతో ఉర్స క్లస్టర్స్ సీవోవో సతీశ్, సీఆర్వో ఎరిక్ వార్నర్ భేటీ అయ్యారు. ఈ సంస్థ హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు మైత్రా ఎనర్జీ గ్రూప్ ఒప్పందం చేసుకుంది. దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో మైత్రా గ్రూప్ డైరెక్టర్ గిరీశ్ గెల్లి భేటీ అయ్యారు. రూ.7వేల కోట్ల పెట్టుబడికి సంబంధించి మైత్రా గ్రూప్ ఎంవోయూ చేసుకుంది. హైదరాబాద్‌లో 6.9 గిగావాట్ల సోలార్స్ సెల్స్, మాడ్యూల్స్ యూనిట్ ఏర్పాటుకు సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. మరో 6.9 గి.వా. సోలార్ మాడ్యూల్స్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. మైత్రా ఎనర్జీ ప్రాజెక్టులతో సుమారు 2,500 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.

# నా రెమ్యూనరేషన్ చాలా తక్కువ

**ప్రజానావ, ఖైరతాబాద్:** టాలీవుడ్‌లో అగ్ర నిర్మాతల ఇళ్లలో రెండు మూడు రోజులుగా కొనసాగుతున్న ఐటీ దాడులు కలకలంగా మారాయి. అయితే ఈ రెండు రోజుల్లో వారు ఏం పట్టుకున్నారనేది బయటికి రాలేదు కానీ.. ఇంతకు ముందు ఎప్పుడు లేనంతగా ఈ ఐటీ రైడ్స్ జరుగుతుండటం విశేషం. ఈ ఐటీ రైడ్స్‌కి సంబంధించి గురువారం హైదరాబాద్‌లో జరిగిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్‌లో వెంకటేష్ మాట్లాడారు. మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఆయన తన రెమ్యునరేషన్ ఎలా తీసుకుంటారో చెప్పుకొచ్చారు. టాలీవుడ్ ఇండస్ట్రీలో హీరోలు తమ రెమ్యూనరేషన్‌ను మొత్తం వైట్ తీసుకుంటే.. ఏ నిర్మాత కూడా బ్లాక్ చేయాల్సిన అవసరం లేదు. హీరోలు బ్లాక్ తీసుకోకుండా ఉంటే.. ఇంకెవరికీ మేము బ్లాక్ ఇచ్చే అవసరం లేదు. కేవలం హీరోల కోసమే మేము బ్లాక్ ఇవ్వాల్సి వస్తుంది. అలా బ్లాక్ ఇచ్చినదానికి.. మేము బ్లాక్‌లో ఇంట్రస్ట్ కట్టాల్సి వస్తుందని పెద్ద నిర్మాతలు ఈ మధ్య ఎక్కువగా చెబుతున్నారు. దీనిపై మీ అభిప్రాయం ఏమిటని మీడియా అడిగిన ప్రశ్నకు వెంకీమామ సమాధానమిస్తూ..సినిమా టికెట్‌లు మిగతావారి సంగతి నాకు తెలియదు కానీ.. నేను ఫుల్ వైట్. వైట్ లో వైట్ అంతే. నేను తీసుకునేదే కొంచెం. నేను ఎక్కువ తీసుకోను.. తీసుకునేది మొత్తం వైటే తీసుకుంటాను..' అని చెప్పుకొచ్చారు. ఇంతకు ముందు కూడా వెంకటేష్ తన రెమ్యునరేషన్ గురించి మాట్లాడారు. నేను తీసుకునేదే చాలా తక్కువ. అందులోనూ మళ్లీ కొందరు నిర్మాతలు పూర్తిగా ఇవ్వరు. అదని, ఇదని చెబుతుంటారు.. పోనీలే అని నేను కూడా పెద్దగా పట్టించుకోను అని గతంలో తన రెమ్యూనరేషన్‌పై వెంకీ వివరణ ఇచ్చారు. బ్లాక్‌బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్ హీరోగా వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా జనవరి 14న విడుదలై కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా రూ. 200 కోట్ల క్లబ్‌లో చేరి, రికార్డ్ బ్రేకింగ్ హౌస్ ఫుల్ కలెక్షన్స్‌తో పొంగల్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ సక్సెస్‌ను పురస్కరించుకుని చిత్రయూనిట్ బాక్సాఫీస్ సంభవం పేరుతో మీడియా సమావేశాన్ని నిర్వహించింది.

# ఎపి పిటిషన్‌పై ఫిబ్రవరిలో విచారిస్తాం

**న్యూఢిల్లీ, జనవరి 23:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య కృష్ణా జలాల కేటాయింపు వ్యవహారంలో ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ఫిబ్రవరిలో విచారణ చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది. కృష్ణా ట్రైబ్యునల్ నీటి పంపకాల విషయంలో గురువారం సర్వోన్నత న్యాయస్థానంలో ఏపీ ప్రభుత్వం మెన్షన్ చేయడంతో.. ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం నిర్ణయం తీసుకుంది. కృష్ణా ట్రైబ్యునల్‌కు సంబంధించి మూడు రాష్ట్రాల మధ్య పంపకాలు 2014కు ముందే పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర విభజన తర్వాత ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంపకాల వ్యవహారాన్ని తేల్చాలని 2023 అక్టోబరులో కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. అంతకుముందే తెలంగాణ ప్రభుత్వం కృష్ణా ట్రైబ్యునల్‌ను ఆశ్రయించింది. తెలంగాణ భూ భాగంలోనే కృష్ణా నది ఎక్కువగా ప్రవహిస్తోందని.. అందుకని తెలంగాణకు కృష్ణా జలాల్లో 70 శాతం వాటా ఇవ్వాలని ట్రైబ్యునల్‌ను కోరింది. లేదంటే వ్యవహారం తేలే వరకు రెండు రాష్ట్రాలకు 50శాతం చొప్పున నీటి కేటాయింపులు చేయాలని ట్రైబ్యునల్‌లో తెలంగాణ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై ఇప్పటికే ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై విచారణ కొనసాగుతుండగానే మరోసారి కృష్ణా ట్రైబ్యునల్ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో ప్రత్యేకంగా ఏపీ ప్రభుత్వం మెన్షన్ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈ విషయాన్ని ప్రస్తావించింది.



ఫిబ్రవరి 19 నుంచి కృష్ణా ట్రైబ్యునల్ విచారణ ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతకుముందే తాము దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై వాదనలు విని తీర్పు ఇవ్వాలని ఏపీ కోరింది. అందుకు అనుగుణంగా స్పందించిన ధర్మాసనం.. ఫిబ్రవరి 13న మధ్యాహ్నం 2 గంటలకు వాదనలు వింటామని తెలిపింది. ఆ మేరకు తెలుగు రాష్ట్రాలు, కేంద్రం సిద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
శుక్రవారం
24 జనవరి 2025


# హామీల అమలులో తగ్గేది లేదు

- 26 నుంచి నాలుగు పథకాలు అమలు చేసి తీరుతాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజానావ, సూర్యాపేట:** జనవరి 26 గణతంత్ర దినోత్సవం నుంచి రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ ప్రారంభించి తీరుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇచ్చిన హామీని నిలబెటుటకోవడంలో వెనక్కి తగ్గమని అన్నారు. బిఆర్ఎస్ లాగా మాయమాటలు తమకు రావని కూడా అన్నారు. గురువారం కోదాడ వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రానీ వారు ఆందోళన చెందొద్దని.. రేషన్ కార్డు జారీ నిరంతర పక్రియ క్లారిటీ ఇచ్చారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందుతోందని హామీ ఇచ్చారు. జనవరి 26 నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు నాలుగు పథకాలను అమలు చేసి తీరుతామని.. ఇందులో ఎలాంటి సందేహం అక్కర్లేదన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బీఆర్ఎస్ దద్దమ్మలు ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్ని ÷ర్ అయ్యారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ప్రతి పక్షాల మాటలు నమ్మి గందరగోళానికి గురి కావొద్దని ప్రజలకు సూచించారు. ప్రజా సంక్షేమం కోసం నేను, నా సతీమణి పద్మావతి నిరంతరం పని చేస్తామని పేర్కొన్నారు.

## హైదరాబాద్ ఆధారిత కంపెనీలతో దావోస్‌లో ఒప్పందాలా?

- ఇదేనా రేవంత్ ఇన్నోవేటివ్ ఆలోచన
- ట్విటర్ వేదికగా సీఎంపై కేటీఆర్ సెటైర్లు



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావటమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. దావోస్ వేదికగా జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో పలు కంపెనీలతో చర్చలు, ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే మేఘా, స్కైరూట్ ఏరోస్పేస్, కంట్రోల్‌ఎస్ వంటి పలు కంపెనీలతో వేల కోట్ల ఒప్పందాలు జరిగాయి. అయితే ఈ పెట్టుబడుల ఒప్పందాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. రేవంత్ సర్కార్‌పై సెటైర్లు వేశారు. హైదరాబాద్ ఆధారిత కంపెనీలను దావోస్ తీసుకెళ్లి ఒప్పందాలు చేసుకోవటమేంటని అన్నారు. రేవంత్ సర్కార్ ఇన్నోవేటివ్ ఆలోచన, పాలన అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. 'వినూత్న ఆలోచన అంటే ఏమిటి ? హైదరాబాద్ ఆధారిత కంపెనీలను స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కి వేల మైళ్ల దూరం ప్రయాణించి పెట్టుబడులు ప్రకటించేలా చేయడం! నిజంగా సర్కస్‌లా ఉంది. హైదరాబాద్‌లో చాయ్ తాగుతూ పూర్తి చేయాల్సిన ఒప్పందాలను.. స్విట్జర్లాండ్‌లో హాట్ చాక్లెట్‌తో పూర్తి చేయాల్సి వచ్చింది.' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

## మంత్రి సీతక్క వ్యాఖ్యలతో పల్లెల్లో ఎన్నికల ఫీవర్

- ఏ నలుగురు ఉన్న చోట్ల ఎన్నికలపై చర్చ
- స్థానిక సంస్థల ఎన్నికలపై ఊహాగానాలు
- త్వరలో రాష్ట్రంలోని 540 మండలాల్లోని 12,966 గ్రామాల్లోని సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలోని పల్లెల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల ఫీవర్ మొదలైంది. గ్రామాల్లో ఏ నలుగురు ఓ చోట గూమి కూడినా స్థానిక సంస్థల ఎన్నికల గురించే మాట్లాడుకుంటున్నారు. ఈసారి ఎవరు పోటీ చేస్తారు..? పోటీ చేసే ఫలానా మల్లయ్య లేదా ఎల్లయ్య గెలుస్తాడా..? ఓట్లు పడతాయా..? అని సీరియస్ డిస్కషన్ పెట్టుంటున్నారు. ఇక నోటిఫికేషన్ ఎప్పుడెప్పుడు వస్తుందా..? అని ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహులు సైతం ఎదురు చూస్తున్నారు. సర్పంచ్‌గా పోటీ చేయాలనుకుంటున్న వారు గ్రామాల్లోనే మకాం వేసి ప్రజల్ని మచ్చిక చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మంచి, చెడులతో ఏమాత్రం సంబంధం లేకుండా గ్రామాల్లో ప్రతి కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో మమేకమవుతున్నారు. మరికొందరు ఒకడుగు ముందుకేసి ప్రత్యేకంగా మేనిఫెస్టో సైతం రిలీజ్ చేస్తున్నారు. తమను గెలిపిస్తే.. గ్రామాన్ని అభివృద్ధి పథకంలో తీసుకెళ్తామంటూ హామీలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ ఎన్నికలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కీలక అప్డేట్ ఇచ్చారు. గ్రామ పంచాయతీలకు వీలైనంత త్వరలో ఎన్నికలను నిర్వహించేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. బీసీ రిజర్వేషన్ల ఖరారుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయగా.. ఇప్పటికే నివేదిక సిద్ధమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన ముగించుకొని వచ్చాక ఆమోదం పొందుతుందని తెలిపారు. బుధవారం సెక్రటేరియట్‌లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన మంత్రి.. సీఎం రేవంత్ వచ్చాక పంచాయతీ ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకుంటుందని అన్నారు. కాగా, మంత్రి ప్రకటనతో ఆశావహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఫిబ్రవరి చివరి వారంలో ఎన్నికలు ఉండే ఛాన్స్ ఉందని గత కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. దీంతో గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీలుగా పోటీ చేసే వారు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. తెలంగాణలో మొత్తం 540 మండలాల్లోని 12,966 గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. 1,14,620 వార్డులకు రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలను నిర్వహించనుంది. అందుకు సంబంధించిన జాబితాను పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించింది. క్రితంసారి 535 మండలాల్లోని 12,732 గ్రామాల్లో మొత్తం 1,13,152 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఈసారి అదనంగా మరో 5 మండలాలు, 234 గ్రామాలు, 1,468 వార్డుల్లో ఎన్నికలు జరగనున్నట్లు తెలిసింది. గతేడాది ఫిబ్రవరితో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియగా.. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పాలనను సాగిస్తున్నారు.




## కరీంనగర్ నుంచి రాజకీయ విమర్శలు బంద్

### అభివృద్ధి గురించే మాట్లాడుతానన్న బండి

**ప్రజానావ, కరీంనగర్:** ఇప్పటినుంచి కరీంనగర్‌లో రాజకీయ విమర్శలు చేయనని అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన నిర్ణయం ప్రకటించారు. రాజకీయాల్లో పదవులు వస్తుంటాయి, పోతుంటాయని, కానీ చేసిన అభివృద్ధి, మంచి పనులే శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. జెండా, ఎజెండాలను పక్కనపెట్టి అభివృద్ధి ధ్యేయంగా అన్ని పార్టీల నాయకులతో కలిసి పనిచేస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావుతో కలిసి 14 వ డివిజన్ లో పలు పనులను, పద్మానగర్ లోని 16వ డివిజన్ లో నూతనంగా నిర్మించిన 'ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్' ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్‌కు ధీటుగా కరీంనగర్ ను?అభివృద్ధి చేస్తామన్నారు. 'స్మార్ట్ సిటీ నిధులు అనేక కారణాలవల్ల పూర్తిగా వినియోగంలోకి రాలేదు. ఇప్పుడిప్పుడే అవన్నీ ఖర్చు చేసి అభివృద్ధి చేసుకుంటున్నం. కేంద్రం నుండి తప్పకుండా నిధులు తీసుకొస్త . రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధుల కోసం కొట్లాడి సాధించుకుంటాం.' అని బండి సంజయ్? అన్నారు.



## ఏకపక్షంగా కూల్చివేతలు మంచివికావు : దానం నాగేందర్



**ప్రజానావ, ఖైరతాబాద్:** హైదరాబాద్ నగరంలో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి చిరువ్యాపారులు ఏర్పాటు చేసుకున్న షెడ్లను కూల్చివేతలపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మరోసారి స్పందించారు. కూల్చివేతలపై అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆదర్శ్‌నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీడియాతో మాట్లాడిన దానం.. పేద ప్రజల జీవనాధారాన్ని అధికారులు ధ్వంసం చేస్తున్నారని ఫైరయ్యారు. నిజంగా రోడ్లకు ఇబ్బంది ఉన్న చోట్ల కూల్చివేతలు చేపడితే ఎటువంటి నష్టం లేదని అన్నారు. కానీ అధికారులు అడ్డగోలుగా కూల్చివేతలు చేపడుతున్నారన్నారు. ఈ కూల్చివేతల విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. చిరు వ్యాపారులు పొట్టకూటి కోసం షెడ్లు ఏర్పాటు చేసకుంటే వాటిని కూల్చేయటం దుర్మార్గం అన్నారు. వాటిని కూల్చేస్తే వారికి బతుకుదెరువు ఏంటని ప్రశ్నించారు. రేవంత్ సీఎం అయిన తొలినాళ్లలో ఐటీసీ కోహినూర్ వద్ద కుమారి ఆంటీకి కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైందని చెప్పారు. సీఎం రేవంత్ జోక్యం చేసుకొని ఆమె జోలికి వెళ్లొద్దని చెప్పినట్లు గుర్తు చేశారు. కుమారి ఆంటీ లాగే ఇతర వ్యాపారుల జోలికి వెళ్లొద్దని దానం కోరారు. ఒకవేళ పాలసీ కింద కూల్చివేతలు చేపడితే.. ముందు పాతబస్తీలో కూల్చివేతలు చేపట్టాలన్నారు. అలా చేస్తే.. తాను కూడా సహకరిస్తానని అన్నారు. కూల్చివేతలు చేపడితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. కూల్చివేతల కారణంగా తమకు నిద్రకూడా పట్టడం లేదని దానం వ్యాఖ్యనించారు.

## ఎందుకు లాప్‌ట్యాప్స్ పంపిణీ చేయడం లేదు : ఆర్ఎస్ ప్రవీణ్



**ప్రజానావ, హైదరాబాద్:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాది గౌలిదొడ్డి(బాయ్స్) గురుకులంలో చదువుతూ ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు పొందిన విద్యార్థులకు ల్యాప్‌టాప్స్ అందించేవారని ఇప్పుడు ఎందుకు అందించడం లేదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. కానీ ఈ ఏడాది మాత్రం ఇప్పటి వరకు విద్యార్థులకు ల్యాప్‌టాప్స్ అందలేదన్నారు. గొప్ప చదువులు చదవాలనుకునే గురుకుల విద్యార్థులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే గురుకులాల్లో లాప్‌ట్యాప్స్ అందలేదని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మెసేజ్ పెట్టడంతో ఈ మేసేజ్‌పై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. మీరు హైదరాబాద్ నుండి కరీంనగర్‌కు హెలికాప్టర్‌లో పోయిన ఖర్చుతో ఈ పేద బిడ్డలకు మంచి ల్యాప్‌టాప్స్ పంపిణీ చేయవచ్చు. రూ. 32 వేల ప్లేటు మీల్స్ గురించి నేను మాట్లాడను అని రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చురకలంటించారు.

## పదేళ్లు పడుకుని ఇప్పుడు విమర్శలా


### రేషన్ కార్డులు ఇస్తామంటే అడ్డుకోవడమా
### బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల



**ప్రజానావ, యాదగిరిగుట్ట :** తెలంగాణ రాష్ట్రంలో అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలని చూస్తుంటే బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకుంటున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. గతంలో ఒక్క కార్డు కూడా ఇవ్వలేని వారు ఇవ్వాళ ప్రజల పేరుతో మొసలి కన్నీరు కారుస్తున్నారని, పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేని సిగ్గులేని నేతలు గ్రామసభలకు అడ్డుతగులుతున్నారని మంత్రి ఘాటుగా స్పందించారు. దీక్షలు, నిరసనల పేరుతో అడుగడుగునా అడ్డం పడుతున్నారని తుమ్మల ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పదేళ్ల విధ్వంస పాలనకు గురైన రాష్ట్రాన్ని ఆదుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. అందుకే తెలంగాణ రైతాంగాన్ని ఆదుకునేందుకు రుణమాఫీ చేసినట్లు చెప్పుకొచ్చారు. అన్నదాతలకు మేలు చేస్తుంటే నల్లగొండలో రైతు దీక్ష చేస్తున్నారంటూ మంత్రి తుమ్మల నిప్పులు చెరిగారు. నల్లగొండ రైతు దీక్ష చేయాలని భావిస్తున్న బీఆర్ఎస్ నేతలు పదేళ్లపాటు అధికారంలో ఉండి రైతులకు రుణమాఫీ ఎందుకు చేయలేదని మంత్రి నిలదీశారు. జనవరి 26 నుంచి అన్నదాతలకు రైతు భరోసా ఇవ్వనున్నట్లు మంత్రి తుమ్మల మరోసారి గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డును తాకట్టుపెట్టి కొంతమంది రైతులకు రైతు బంధు వేశారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో దొడ్డు బియ్యం మాఫియా ఉందని, అందుకే ప్రజలకు సన్నబియ్యం అందిస్తున్నట్లు చెప్పారు. దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ రాష్ట్రానికి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తీసుకువస్తారని మంత్రి తుమ్మల ధీమా వ్యక్తం చేశారు.

## వృద్ధాప్య పెన్షన్లు ఆపడం సరికాదు

### మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



**ప్రజానావ, హైదరాబాద్:** వృద్ధులకు వృద్ధాప్య పెన్షన్లు ఆపడం సరికాదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. పెన్షన్లలో కోతలు విధించడమంటే.. వారి నోటికాడి బుక్కను లాగేసుకోవడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూరు గ్రామ పంచాయతీలో కొడుకు ఇంటి పన్ను కట్టలేదని తల్లి వృద్ధాప్య పెన్షన్‌లో కోత విధించిన ఘటనపై హరీశ్‌రావు స్పందించారు. కొడుకు ఇంటి పన్ను కట్టకుంటే, తల్లికి వచ్చే వృద్ధాప్య పింఛన్ ఆపడం అన్యాయం, అమానుషం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల తీరు కుటుంబ సభ్యుల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఉన్నాయి. పింఛన్ డబ్బులను కూడా ఇంటి పన్ను కింద జమ చేసుకుంటే, ఆ వృద్ధుల బతుకు బండి నడిచేది ఎట్ల? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.అధికారంలోకి వస్తే ప్రతి నెలా రూ.4 వేలు పింఛన్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు వచ్చే రూ. 2 వేల పింఛన్‌ను గుంజుకోవడం దుర్మార్గమైన చర్య అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఒకవైపు లబ్ధిదారుల్లో కోత విధిస్తూ, మరో వైపు చేతికందిన పింఛన్‌ను ఇంటి పన్ను బకాయిలో జమ చేయడం శోచనీయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూరు గ్రామ పంచాయతీ పరిధిలో 15 మంది వృద్ధులకు వెంటనే పింఛన్లు చెల్లించాలని, ఇంటిపన్ను, ఇతర కారణాలు చెప్పి పింఛన్లు ఆపకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..





# ఈ నెల రోజులే కీలకం

**ఉత్తమ ఫలితాలపై అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి**
**డీఐఈఓ రవీందర్ రెడ్డి**

**ప్రజానావ, బెజ్జంకి:** వార్షిక పరీక్షల ముందు నెల రోజులు విద్యార్థులకు ఎంతో కీలకమని, ఉత్తమ ఫలితాలు సాధించడంలో అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ) రవీందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కళాశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు ప్రశాంతంగా సన్నద్ధం కావాలని సూచించారు. అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వెనుకబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా రూపొందించిన ప్రత్యేక కార్యాచరణను చివరి వరకు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు పాల్గొన్నారు.

# రేగులపల్లిలో గ్రామసభ రసాభాస



**ప్రజానావ, బెజ్జంకి:** మండలంలోని రేగులపల్లిలో గురువారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. అర్హులైన వారిని గుర్తించలేదని గ్రామస్తులు, బీఆర్ఎస్, సీపీఎం, బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇల్లు లేని 535 మంది దరఖాస్తు చేసుకోగా,367 మందిని మాత్రమే ఎంపిక చేసినట్లు అధికారులు ప్రకటించారు. అయితే అర్హులైన అనేక మంది జాబితాలో లేకపోవడంతో నిరుపేదులు నిరాశ చెందారు. అధికారులను ప్రశ్నించినప్పటికీ వారు మొబైల్ యాప్ తప్పు అని సమాధానం ఇచ్చారు. ఆత్మీయ భరోసా పథకంలో 83 మందిని ఎంపిక చేసినప్పటికీ, కొంతమంది వ్యవసాయ భూమి ఉన్నవారు ఉండడంతో నిజమైన భూమిలేని పేదలను గుర్తించాలని డిమాండ్ చేశారు. నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసిన 120 మందిలో కేవలం 46 మందికి మాత్రమే కార్డులు మంజూరు చేయడం జరిగిందని, ఈ జాబితాలను పునఃసమీక్షించి అర్హులైన పేదలను గుర్తించి నూతన జాబితాను తయారు చేయాలని అధికారులను నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దుంభాల రాజామహేందర్ రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్, బీజేపీ నాయకుడు నూనె ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు మాతంగి రజనీకాంత్, తాళ్ల స్వామి, కొట్టే శ్రీనివాసరెడ్డి, కుమ్మరి శ్రావణ్, వంగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా పథకాలు అందించాలి



**ప్రజానావ, బెజ్జంకి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సభల్లో సంక్షేమ సంక్షేమ పథకాల అమలు అర్హత ఉన్న చివరి పేదవారికి అందాలని సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేశ్ అన్నారు. అదేవిధంగా సంక్షేమ పథకాలను నిరంతరం కొనసాగించాలని డిమాండ్ చేశారు. గత ఏడాది వచ్చిన ప్రజాపాలన దరఖాస్తులను సమగ్రంగా ఇంటింటికి సర్వే వివరాలు సేకరించిన సంబంధించిన అధికారులు చాలావరకు అర్హులైన విడుదల చేసిన జాబితాలో పేరు లేకపోవడంతో అర్హులైన ప్రజలు నిరుత్సాహానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అసలైన అర్హులకు పథకాలు అందేలా చూడాలన్నారు.

# గ్రామసభలను వినియోగించుకోవాలి





**ప్రజానావ, బెజ్జంకి:** బెజ్జంకి మండల కేంద్రంలో గురువారం గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి క్రిష్ణ పాల్గొని మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో జరుగుతున్న గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎకరాకు ఆరు వేల చొప్పున రైతు భరోసా వేయటం జరుగుతుందని, దేశంలోనే మొదటి సారిగా భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు రూ.12 వేల ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అర్హుల జాబితా లో పేర్లు రానివారు మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ అంజయ్య, ప్రత్యేక అధికారి ఆర్ఎల్ మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ రెడ్డి, ఏఈఓ రేణుక, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


# మహాద్భుతంగా కుంభమేళా

- రాత్రివేళల్లో కళ్లు మిరుమిట్లు గొలిపేలా కుంభప్రాంత
- అమృతతత్వాన్ని సంతరించుకున్న జీవనదులు
- పుణ్యతిథుల్లో హాజరుకానున్న రాష్ట్రపతి, ప్రధాని తదితరులు



**ప్రయాగరాజ్, జనవరి 23 :** దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రవహిస్తున్న ఆయా నదుల్లోని నీళ్లు కొన్ని సమయాల్లో అమృత తత్వాన్ని సంతరించు కుంటాయి. ఈ సమయాన్నే కుంభమేళా సమయంగా భావిస్తారు. ఈ నదుల్లో స్నానం చేస్తే పుణ్యం లభిస్తుందని పురణాలు చెబుతున్నాయి. మన పూర్వీకులు కూడా ఇదే చెప్పేవారు. అందుకే నదుల్లో ఆయా సమయాల్లో పుణ్యస్నానాలు చేస్తుంటారు. ఇప్పుడు కుంభమేళాలో కూడా నదీస్నానం చేసేందుకు కోట్లాది భక్తులు బారులు తీరుతున్నారు. మహా కుంభమేళాకు సంబంధించిన రాత్రిపూట దృశ్యాలు అద్భుతంగా సాక్షాత్కరిస్తున్నాయి. రాత్రివేళల్లో మహాకుంభ మేళా దీపకాంతులతో అందంగా ముస్తాబైన నవ వధువులా కనిపిస్తోంది. మహా కుంభమేళా..ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక..ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో వేదికగా జరుగుతోంది. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది తరలివస్తున్నారు. జనవరి 13 ప్రారంభమైన కుంభమేళా ఫిబ్రవరి 26 వరకూ దాదాపు నలభై అయిదు రోజులపాటు జరుగుతుంది. గంగమ్మతల్లిని మనసారా పూజించడం ఈ వేడుక అసలైన పరమార్థంగా పండితులు చెబుతుంటారు. క్షీరసాగర మథనం సమయంలో ఆ సాగరంలోంచి అమృతభాండం ఉద్భవించింది. ఆ పాత్రకోసం దేవతలు- రాక్షసులు పోరాటం సాగిస్తున్నప్పుడు అందులోంచి నాలుగు అమృతపు చుక్కలు భూలోకంలోని నాలుగు నదుల్లో పడ్డాయట. దాంతో ఆ నాలుగు నదులూ అత్యంత పవిత్రతను సంతరించుకున్నాయని పురాణాలు చెబుతున్నాయి. హరిద్వార్‌లోని గంగ, ఉజ్జయినిలోని శిప్రా, నాసిక్‌లోని గోదావరి, ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణీ సంగమంలో అమృత చుక్కలు పడ్డాయని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతారు. ఈ కారణంగా ఆయా నదుల్లోని నీళ్లు కొన్ని సమయాల్లో అమృత తత్వాన్ని సంతరించుకున్నాయని చెబుతుంటారు. ఈ సమయాన్నే కుంభమేళా సమయంగా భావిస్తారు. అందుకే అప్పుడు ఈ నదుల్లో స్నానం చేసేందుకు కోట్లాది భక్తులు బారులు తీరుతుంటారు. ఆ ప్రత్యేక సమయాన్ని బృహస్పతీ సూర్యచంద్రుల కదలికల్ని బట్టి నిర్ణయి-ుస్తారు. వీటి ఆధారంగానే కుంభమేళాను రెండు రకాలుగా జరుపుతారు. అవే అర్ధ కుంభమేళా, మహాకుంభమేళా. అర్ధ కుంభమేళాని ఆరేళ్లకోసారి చేస్తారు. మహా కుంభమేళా పన్నెండేళ్లకోసారి వస్తుంది. ఈ పన్నెండేళ్లకోసారి వచ్చే మహా కుంభమేళాను





మాత్రం దేవతల గురువైన బృహస్పతి కదలికల్ని బట్టి నిర్ణయిస్తారు. బృహస్పతి తన రాశి చక్రాన్ని పూర్తి చేయడానికి 12 సంవత్సరాలు పడుతుంది. గనుక ఆ సమయాన్ని ఆధారంగా చేసుకునే తేదీలను ప్రకటిస్తారు. ఇప్పుడు జరుగుతోంది మహా కుంభమేళానే. మహా కుంభమేళాలో పాల్గొనేందుకు దేశం నుండి మాత్రమే కాకుండా విదేశాల నుండి కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఈ క్రమంలోనే మహా కుంభమేళాకు సంబంధించిన రాత్రిపూట దృశ్యాలు ఇంటర్‌నెట్‌లో వైరల్ అవుతున్నాయి. రాత్రివేళ మహాకుంభం మేళా ఏర్పాట్లు చూసేందుకు తరలివస్తున్నారు. -ుాత్రిపూట ఆకాశం నుండి తీసిన మహా కుంభమేళ ఫోటోలు నిజంగా హృదయాన్ని హత్తుకునేలా ఉన్నాయి. ఆ దృశ్యం ఎంత అందంగా, మనోహరంగా ఉందో మాటల్లో చెప్పలేం. కళ్లతో చూడాల్సిందే..మహాకుంభమేళా ఏర్పాట్లు పగటిపూట మాత్రమే కాదు.. రాత్రిపూట కూడా ప్రజల్లో ప్రత్యేక ఆకర్షణగా మిగిలిపోతుందనే చెప్పాలి. 'హర్ హర్ గంగే' అనే నామం జపిస్తూ ప్రజలు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఇకపోతే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు ప్రముఖులు ప్రయాగ్‌రాజ్‌కు రానున్నారని, దీనితో పాటు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కూడా ఇక్కడే జరగనుందని యూపీ సీఎం యోగి వివరాలు వెల్లడించారు. అలాగే, జనవరి 26 గణతంత్ర దినోత్సవం, మౌని అమావాస్య, వసంత పంచమి సందర్భంగా ..ప్రముఖుల రాక పెరుగనుంది. ఈ మేరకు ఫిబ్రవరి 5న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహాకుంభమేళాని సందర్శించే అవకాశం ఉందని సమాచారం. జనవరి 27న జరిగే మహా కుంభమేళలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నట్టు తెలిసింది. ఫిబ్రవరి 10న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రయాగ్‌రాజ్‌ని సందర్శిస్తారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా నగరంలో నిర్వహించే పలు ప్రధాన కార్యక్రమాలకు హాజరు కానున్నట్టు తెలిసింది. ఫిబ్రవరి 1న జరిగే కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్ కూడా పాల్గొంటారని భావిస్తున్నారు. జనవరి 27న హోంమంత్రి అమిత్ షా తన షెడ్యూల్ ప్రకారం మహాకుంభ్‌లో పాల్గొంటారు. ఆయన సంగమంలో పవిత్ర స్నానం చేయనున్నారు. గంగపూజ నిర్వహించి అధికారులతో సమావేశం కానున్నారని తెలిసింది. ప్రధాని పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం, మౌని అమావాస్య, వసంత పంచమి సందర్భంగా మహాకుంభమేళాకు జనం మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రయాగ్ రాజ్ ప్రాంతంలో జనసమూహ నిర్వహణ, కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత మెరుగుపరచడపై సీఎం అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ఈ సమయంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచిస్తూ అధికారులకు పలు మార్గదర్శకాలు జారీ చేశారు.

# రాజకీయ లబ్ధి కోసమే గ్రామసభలు

**సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి**




**ప్రజానావ, కరీంనగర్:** కేవలం రాజకీయ ప్రాబల్యం కోసం, స్థానిక సంస్థల ఎన్నికల లబ్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభల పేరుతో ప్రజలను మభ్యపెడుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి దుయ్యబట్టారు. కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు వద్దకు గ్రామసభలు పేరుతో ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేయడమే తప్ప అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. గతంలో ప్రజాపాలనకు చేసిన ధరఖాస్తులనే గ్రామసభల్లో జాబితా తయారు చేశారని, అందులోనూ నిజమైన అర్హులైన వారికి ఇళ్లు, రేషన్ కార్డులు 30 శాతమే చోటు కల్పించారన్నారు. కాంగ్రెస్ మంత్రులు అర్హులందరికీ మంజూరు చేస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. సీపీఐ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు. ఫిబ్రవరి నుంచి శాఖ, మండల, జిల్లా మహాసభల నిర్వహణ కోసం నిర్మాణ కార్యక్రమాలు రూపొందించనున్నట్లు వెంకటస్వామి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి,టేకు మల్ల సమ్మయ్య, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచన్న యాదవ్, బామండ్ల పెల్లి యుగేందర్, నాయకులు నల్లగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

**ప్రజానావ, బెజ్జంకి:** బెజ్జంకి మండలంలోని దాచారం గ్రామంలో సీఎం సహాయ నిధి చెక్కులను మాజీ ఎంపీపీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్ చేతుల మీదుగా స్థానిక నాయకులు బైర సంతోష్ తో కలసి దాచారం గ్రామానికి చెందిన దీటి బాలవ్వ కు రూ. 43వేల చెక్కును పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కొరకు ముఖ్యమంత్రి సహాయనిది ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. అదేవిధంగా బెజ్జంకి మండల కేంద్ర అనుబంధ గ్రామం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన మాశం నర్సయ్యకు రూ.35,500 సీఎం సహాయనిధి చెక్కును శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం చైర్మన్ జెల్ల ప్రభాకర్, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్యతో కలసి అందజేశారు. గుగ్గిళ్ల గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ చెప్యాల శ్రీనివాస్ గౌడ్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోనాల మల్లేశం, బండిపెల్లి రాజు, రొడ్డ మల్లేశం, లింగాల శ్రీనివాస్, బోనగం రమేష్ గౌడ్, బండి వేణు యాదవ్, జహంగీర్, ఇస్మిల్ల అయిలయ్య, ఎలిగే సతీష్, గుబిరె సతీష్, కొల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి

**అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు**



**ప్రజానావ, సైదాపూర్:** ప్రజలందరి సహకారంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని, గ్రామంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని గ్రామ ప్రత్యేకాధికారి, మండల పంచాయతీ అధికారి కాజా బసిరుద్దీన్ అన్నారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గర్రెపల్లి నూతన గ్రామపంచాయతీలో తొలి గ్రామ సభను అధికారులు గురువారం నిర్వహించారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు రేషన్ కార్డులు,రైతు భరోసా,ఇందిరమ్మ ఇండ్లు,ఆత్మీయ భరోసా వంటి పథకాలు అందుతాయని,అపోహలను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మీసా బీరయ్య, వెన్నంపల్లి సొసైటీ చైర్మన్ బిల్లా వెంకట్ రెడ్డి, గ్రామ పంచాయతీ రాజీవ్, నాయకులు గుండారపు శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ కొడగాని మోహన్ రావు, దోకిడి తిరుపతి, కిషన్, వేముల కొమురయ్య, మామిడి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు. నూతన గ్రామపంచాయతీలో గ్రామసభ ఏర్పాటు చేయడం పట్ల గర్రెపల్లి ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

# టీఎస్‌పీఈ(1535) బలోపేతమే లక్ష్యం







**ప్రజానావ, కరీంనగర్:** తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్(1535) బలోపేతమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని కరీంనగర్‌రీజియన్‌గౌరవ అధ్యక్షుడు జీ సురేందర్‌ప్రసాద్, రీజినల్‌అధ్యక్షుడు ఠాకూర్‌చందర్‌సింగ్, రీజినల్‌సెక్రటరీ ఎండీ జియాఉద్దీన్ స్పష్టం చేశారు. గురవారం వారు కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. రీజియన్‌పరిధిలో సంఘం సభ్యత్వాలను పెంచుతామని చెప్పారు. అన్ని సంఘాలను కలుపుకొని ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. ఉద్యోగ, కార్మిక, ఔట్‌సోర్సింగ్, ఆర్టిజన్ తదితర వాటితో పాటు వివిధ ట్రేడ్‌యూనియన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు. విద్యుత్‌శాఖలో ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం మార్గమే తమ ధ్యేయమని పేర్కొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
శుక్రవారం
24 జనవరి 2025




# మహనీయుల నుంచి పాఠాలు నేర్చుకోవచ్చు


- సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజానావ, సిరిసిల్ల బ్యూరో:** మహనీయుల జీవితాల నుంచి మనం అనేక వ్యక్తిత్వ వికాస పాఠాలను నేర్చుకోవచ్చని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వర్గీయ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంత్యుత్సవంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా అధికారులు లతో కలిసి పాల్గొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఆజాద్ హింద్ ఫౌజ్ ను స్థాపించిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని, ఆయన జయంత్యుత్సవాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆజాద్ హింద్ సంస్థ నేడు ఇండియన్ నేషనల్ ఆర్మీగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో రామ్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్ థీమ్‌తో ఓటర్ దినోత్సవ వేడుకలు



నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే థీమ్‌తో 15వ జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలను కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓటర్ నమోదు పెంపు, ఎథికల్ ఓటింగ్ పై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తామని, ఈ సంవత్సరం నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే థీమ్ తో వేడుకలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలోని ప్రతి బూత్ స్థాయి అధికారి పోలింగ్ స్టేషన్ పరిధిలో నూతన ఓటర్లకు ఓటర్ కార్డుల పంపిణీ, వృద్ధ ఓటర్ల సన్మానం వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రతి గ్రామం, వార్డుల్లో ఓటర్ ప్లేడ్జ్ తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.



## నేతాజీకి విప్ ఘన నివాళి

**ప్రజానావ, వేములవాడ:** స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వేములవాడ పట్టణంలోని సుభాష్ నగర్ లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటిష్ పాలనలో మగ్గిపోతున్న ప్రజలకు అండగా నిలిచి, బ్రిటిష్ వారిని గడగడలాడించిన భరతమాత ముద్దుబిడ్డ నేతాజీ అంటూ కొనియాడారు. నిరంకుశ బ్రిటిష్ పాలకులను ఎదిరించేందుకు తనదైన పంథాలో పోరాడిన దేశభక్తుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేశ్, ఇప్పపుల అజయ్, వంగళ శ్రీనివాస్, సాగరం వెంకట స్వామి, గూడూరి మధు, కూరగాయల కొమురయ్య, కొక్కుల బాలకృష్ణ, తోట రాజు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- జాబితాల్లో పేర్లు లేనివారి కోసం మళ్లీ దరఖాస్తుల స్వీకరణ
- ముంపు గ్రామాల ప్రజలకు ఉపాధికి పరిశ్రమల ఏర్పాటు
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**ప్రజానావ, వేములవాడ:** అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో గురువారం జరిగిన ప్రజా పాలన గ్రామసభకు ప్రభుత్వ విప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాపాలన గ్రామసభల్లో చదివిన జాబితాల్లో వివిధ పథకాల కింద పేర్లు రాని అర్హులు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అధికారులు దరఖాస్తులపై తక్షణమే విచారణ జరిపి వారిని ఎంపిక చేస్తారని స్పష్టం చేశారు. దీనిపై దరఖాస్తుదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. గత ప్రభుత్వంలా నాలుగు గోడల మధ్య లబ్ధిదారులను ఎంపిక చేయడం లేదని, ప్రజల సమక్షంలో లబ్ధిదారులకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పదేళ్లు ప్రజలు కళ్లుకాయలు కాసేలా ఎదురుచూసినా నాటి బీఆర్ఎస్ సర్కార్ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందించిన పాపాన పోలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు దశల వారీగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు వారి ఖాతాల్లో జమ, పంటలకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పెంపు వంటి సంక్షేమ పథకాలను ఈనెల 26 నుండి అందించడం జరుగుతుందని చెప్పారు.

### పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని విప్ స్పష్టం చేశారు. గతంలో ఎమ్మెల్యే, మంత్రుల కోటా కింద ఇండ్లు ఇచ్చారని.. కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 3500 ఇండ్లు ప్రజా కోటా కింద పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఏ సమస్యలు ఉన్నా వాటికి పరిష్కారం చేస్తూ ముందుకు పోతున్నామన్నారు. ముంపు గ్రామాల్లో 3600 పైచిలుకు ఉన్న దరఖాస్తులను ప్రభుత్వం పరిశీలిస్తుందని, వాటికి త్వరలోనే శాశ్వత పరిష్కారం అవుతుందని భరోసా ఇచ్చారు. నూతన రేషన్ కార్డులు మంజూరు చేసినా తర్వాత సన్నం బియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, అడ తల్లులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10



లక్షలకు పెంపు, 200 యూనిట్ల ఉచితవిద్యుత్ అందజేయడం జరుగుతుందని గుర్తుచేశారు. ముంపు గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పించడానికి మంత్రి శ్రీధర్ బాబుతో ఇప్పటికే మాట్లాడటం జరిగిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజీవ్ మల్హోత్ర, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, అర్బన్ ఎమ్మార్వోలు మహేశ్, సుజాత, హౌసింగ్ డీఈ ముజాఫర్, ఏఈ రాజమౌళి, పంచాయతీ కార్యదర్శి దిలీప్‌కుమార్ రెడ్డి, ఆర్ఐలు సుమలత, రవి, ఏఈఓ అనూష తదితరులు పాల్గొన్నారు.

# నేతాజీ సేవలకు ప్రతి భారతీయుడు గర్వపడాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



**ప్రజానావ, వేములవాడ:** దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలకు ప్రతీ భారతీయుడు గర్వపడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలను బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు డా.రాపెల్లి శ్రీధర్ నాయకులతో కలిసి సుభాష్ నగర్ లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ చరిత్రలో జయంతి తప్ప, వర్ధంతి లేని మహనీయుడు.. గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. యువతలో స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని నింపిన మహనీయున్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దేశ భక్తి, సంస్కృతి, సేవలాంటివి ప్రతి ఒక్కరిలో ఉండాలని, మనం నేతాజీకి ఇచ్చే నిజమైన నివాళి ఇదేనంటూ ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రేగుల మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, సీనియర్ నాయకులు సంటి అంజిబాబు, సంటి మహేశ్, కృష్ణ స్వామి, రేగుల రాజు, నామాల శేఖర్, బిల్లా కృష్ణ, బోనాల శివ, యస్వంత్, న్యాత మహేశ్, రంజిత్ రెడ్డి, సీహెచ్ శివ, తడుక రాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.







## రసాబసగా గౌరవెల్లి గ్రామసభ

**ప్రజానావ, హుస్నాబాద్:** అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన గ్రామసభ రసాబసగా మారింది. లబ్ధిదారులను పక్కనపెట్టి అనర్హులందరినీ ప్రకటించే కార్యక్రమం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం గ్రామసభ ఏర్పాటు చేసి గత ఆరు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు మాత్రమే గ్రామసభలో ప్రకటించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలనే ఈ ప్రభుత్వం కొనసాగిస్తూ ప్రజలను మభ్యపెడుతుందన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజలను మభ్యపెడుతుందని విమర్శించారు. ఇలాంటి పొరపాట్లు పునరావృతమైతే ప్రజల ఆగ్రహానికి ఈ ప్రభుత్వం కూడా కూలిపోకతప్పదని ప్రజలు హెచ్చరించారు.

## మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్



**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో సుభాష్ చంద్రబోస్ జయంత్యుత్సవాలను బీజేపీ మండలాధ్యక్షుడు మిరియాల్ కార్ బాలాజీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుడు సుభాష్ చంద్రబోస్ జయంత్యుత్సవాలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. దేశస్వాతంత్రం కోసం ఎనలేని పోరాటం చేసిన మహనీయుడు, ఓటమి ఎరుగని ధీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్, బూత్ అధ్యక్షుడు కొమ్ము తిరుపతి, మాలెబోయిన విజయ్, మైలారం వెంకటేశ్, అనబోయిన అభిషేక్, బాబు, కనుకరాజు, శేఖర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌కు అంతరాయం

**ప్రజానావ, వేములవాడ:** శివరాత్రి ముందస్తు పనుల్లో భాగంగా చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతులు చేపట్టడం కారణంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు వేములవాడ టౌన్ ఏఏఈ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా మార్కండేయ నగర్, సాయిబాబా గుడి, సెస్ ఆఫీస్ రోడ్డు, సాయినగర్, కోరుట్ల బస్టాండ్, కట్టు కాలువ, మల్లారం రోడ్డు ఏరియాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

## పంచాయతీరాజ్ ఈఈ మృతి



**ప్రజానావ, కరీంనగర్:** కరీంనగర్ జిల్లా పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఆర్ చంద్రశేఖర్ (59) గురువారం గుండెపోటు మరణించారు. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన చంద్రశేఖర్ ఉద్యోగరీత్యా కరీంనగర్ లోని విద్యానగర్ లో నివాసం ఉంటున్నారు. ఉదయం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు చంద్రశేఖర్ ను హుటాహుటిన అపోలో రీచ్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఆయన తుది శ్వాస విడిచారు.

### చంద్రశేఖర్ మృతిపట్ల కలెక్టర్, ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

గుండెపోటుతో పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖర్ మరణించిన విషయం తెలుసుకున్న మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి హుటాహుటిన ఆపోలో రీచ్ కు చేరుకొని ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మరణానికి గల కారణాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. చంద్రశేఖర్ మృతిపట్ల వారు సంతాపం ప్రకటించారు. ఆస్పత్రిని సందర్శించిన వారిలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ తదితరులున్నారు. ఈఈ ఆకస్మిక మృతి విషయాన్ని తెలుసుకున్న పంచాయతీ రాజ్ పర్యవేక్షక ఇంజినీర్ లచ్చయ్య, క్వాలిటీ కంట్రోల్ ఈఈ సూర్యప్రకాశ్‌తో పాటు పలువురు డిప్యూటీ ఈఈలు, ఏఈలు, మినిస్టీరియల్ స్టాఫ్ ఉద్యోగులు ఆస్పత్రికి చేరుకుని సంతాపం వ్యక్తం చేశారు.

## యువతకు నేతాజీ స్ఫూర్తి



**ప్రజానావ, బెజ్జంకి:** 'మీ రక్తాన్ని ఇవ్వండి.. నేను మీకు స్వాతంత్రం ఇస్తాను' అని ఉద్రూతలూగించిన నేతాజీ నేటి యువతకు ఆదర్శమని మాజీ ఎంపీటీసీ లింగాల లక్ష్మణ్, ప్యాక్స్ వైస్ చైర్మన్ బండి రమేశ్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా బెజ్జంకి మండల కేంద్రంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోస్ పోరాటం నేటి యువతకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లం పెద్దన్న, కల్లూరి రమేశ్, ఐలేని నర్సింహ రెడ్డి, కల్లూరి అజయ్, తూము రమేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పరాక్రమ్ దివాస్ వేడుకలు




**ప్రజానావ, కరీంనగర్:** యువశక్తి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ తీగలగుట్టపల్లి వారి ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని పరాక్రమ్ దివాస్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుభాష్ నగర్ గవర్నమెంట్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ముఖ్య అతిథిగా హాజరై యువతను ఉద్దేశించి మాట్లాడారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ యువతకు మార్గదర్శి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువశక్తి యూత్ నాయకులు తొర్తి శ్రీనివాస్, అరవింద్, శివకుమార్, రామకృష్ణ, అనిల్, ప్రమోద్, సురేశ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో
# నా జోక్యం ఉండదు



- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజానావ, హుస్నాబాద్:** రేషన్ కార్డుల జారీ, మార్పులు చేర్పుల ప్రక్రియ నిరంతరం జరిగేలా సాఫ్ట్వేర్ ను రూపొందిస్తున్నమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణం లోని 15వ వార్డు లో ప్రజా పాలన వార్డు సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. రేషన్ కార్డుల, ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో మంత్రిగా తన జోక్యం ఉండదని, న్యాయంగా పారదర్శకంగా అర్హులైన వారందరికీ మంజూరు చేస్తామన్నారు. అధికారులు ప్రజా పాలన సభల్లో ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులను గుర్తించాలని సూచించారు. రెండు లక్షలకు పైగా ఇంకా రుణమాఫీ కానీ రైతులకు మార్చిలో షెడ్యూల్ పెట్టి రుణమాఫీ చేస్తామన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని, ముందు అధికారుల దృష్టికి తన దృష్టికి సమస్యను తీసుకురావాలని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను పరిష్కరించడం తన బాధ్యత అన్నారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులను ప్రారంభించి, 19వ వార్డులో దళితులతో కలిసి డప్పు వాయించి అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్ పర్సన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలన్నదే ప్రభుత్వం లక్ష్యం

**ప్రజానావ, హుస్నాబాద్:** ప్రతి గ్రామనికి ఆర్టీసీ బస్సు నడపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ఆయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో రూ. 2కోట్ల వ్యయంతో పునరుద్ధరించిన ఆర్టీసీ బస్టాండ్‌ను అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా ఏడాదిలో 134 కోట్ల మంది మహిళలను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చిన ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో హుస్నాబాద్ డిపో పరిధిలోని 169 గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. హుస్నాబాద్ డిపో లాభాల్లో నడవడం శుభసూచకమన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా పెరిగిన




రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచే ప్రయత్నం చేస్తున్నమని, మహిళా సంఘాల ద్వారా 600 ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేయబోతున్నమన్నారు. హైదరాబాద్ లో కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ బస్లను ఏర్పాటు చేశామని, ఆర్టీసీలో సమస్యలు పరిష్కరించి, కారుణ్య నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో హుస్నాబాద్ బస్ డిపోను మరింత అభివృద్ధి చేసి రవాణా సౌకర్యాలు పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, సిద్దిపేట గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత వెంకన్న, ఆర్టీసీ ఈడీ ఇస్రోచా ఖాన్, వైస్ చైర్ పర్సన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి, హుస్నాబాద్ డీఎం వెంకటేశ్వర్లు, పలు డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.



వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ వద్ద రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ రహదారి భద్రత మహోత్సవాలు 2025లో భాగంగా గురువారం సడక్ సురక్ష అభియాన్ జాగ్రత్త కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డితో కలసి పాల్గొన్నారు. అనంతరం విప్ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి రాజన్న ఆలయం వరకు స్వయంగా ఆటో నడిపి కోరుట్ల బస్టాండ్ వద్ద మానవహారంలో పాల్గొని రోడ్డు భద్రత ప్రమాణం చేశారు.

- ప్రజానావ, వేములవాడ



కరీంనగర్‌లోని పద్మనగర్‌లో దాదాపు రూ.14 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, నగర మేయర్ సునీల్ రావు తదితరులున్నారు.

- ప్రజానావ, కరీంనగర్

## కొండల్‌రావు సారంటే
# మా అందరికీ హడల్



- మీ రచనలు మా అందరికీ ఆదర్శం
- ఎస్సారార్ కాలేజీ అంటే గుర్తొచ్చేది కొట్లాటలు.. విజయాలే
- కాలేజీ అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- ఎస్సారార్ కళాశాలలో మూడు పుస్తకాల ఆవిష్కరణ

**ప్రజానావ, కరీంనగర్:** కొండల్‌రావు సారంటే మా అందరికీ హడల్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రముఖ రచయితలు డా. వెలిచాల కొండల్ రావు, డా.గంద్ర లక్ష్మణరావు, ప్రొ. కలువకుంట రామక్రిష్ణ రచనలు తమకు ఆదర్శమని పేర్కొన్నారు. వారి రచనలు తమకు పాఠాలే కాకుండా అప్పుడప్పుడు గుణపాఠాలు కూడా అవుతాయని వ్యాఖ్యానించారు. సమాజంలో నైతిక విలువలు, కుటుంబ బంధాలు పతనమవుతున్నాయని, రచయతలు, కవులు తమ రచనలతో మళ్లీ ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సమాజంలో జరిగే చెడును, అవాస్తవాలను ఖండించకపోవడం కూడా తప్పే అవుతుందనే విషయాన్ని గ్రహించాలన్నారు. ధర్మం అనేది ఆధారంగా రచనలు, కవిత్యాలు రాయాలని కోరారు. గురువారం ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల సెమినార్ హాల్‌లో డా.గంద్ర లక్ష్మణరావు రచించిన 'రామాయణ కల్పవృక్షం %-% లోకానుశీలనం', డాక్టర్ మండలోజు నర్సింహాస్వామి రచించిన 'డాక్టర్ వెల్చాల కొండల్ రావు జీవితం %-% వ్మాయ సేవ', ప్రొ. కలువకుంట రామక్రిష్ణ 'ఫ్రాగ్రన్స్ ఆఫ్ లైఫ్' పేరిట రచించిన ఇంగ్లీష్ అనువాద పుస్తకాలను బండి సంజయ్ ఆవిష్కరించారు.

### సాహిత్య సేవకు నిలువెత్తు నిదర్శనం

'ఇగ కొండలరావు సార్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ తరానికి ఆదర్శం. వారి అంకిత భావం, వృత్తి నిబద్ధత మాలాంటి ఎందరికో ఆదర్శప్రాయం. వారి జీవితం గురించి, సాహిత్య సేవ గురించి రాయాలంటే పీహెచ్ డీ గ్రంథమైతది. 'జయంతి' పత్రిక నిర్వహణ కొండల్ రావు సార్ సాహిత్య సేవకు నిలువెత్తు నిదర్శనం. ఇగ మన కరీంనగర్ పండిత దిగ్గజం లక్ష్మణరావు గారి గురించి ఎంత చెప్పినా తక్కువే. తెలుగు రాష్ట్రాల్లోనే సుపరిచితుడు. వారి ప్రసంగాలను చాలాసార్లు వినేవాడిని. ఇగ మనందరికీ శ్రీరామచంద్రుడన్నా, రామాయణమన్నా గుండెల్లో పెట్టుకొని పూజించుకుంటాం. ఎందుకంటే రామాయణం మనకు నిత్య పారాయణం. ఎప్పుడు, ఏ రూపంలో విన్నా మళ్లీ మళ్లీ వినాలన్పించేంత నిత్య నూతనం. నా ఆదర్శ రాముడు, అందాల రాముడు, అభినవ రాముడు, అయోధ్య రాముడే మనందరికీ ఆదర్శం. ధర్మానికి ప్రతి రూపం రాముడు. ఆదర్శాలు చెప్పడం కాదు, ఆచరించి చూపిన మహనీయుడు. అటువంటి శ్రీరాముడి చరిత్రను 'రామాయణ కల్పవృక్షం' పేరుతో విశ్వనాథ సత్యనారాయణ గారు మనకు గొప్ప పుస్తకాన్ని అందించారు' అని బండి సంజయ్ పేర్కొన్నారు. డా.కలువకుంట రామకృష్ణ కేవలం ఎస్.ఆర్.ఆర్.కాలేజీ ప్రిన్సిపాల్ గా మాత్రమే కాదు, గొప్ప పండితులన్నారు. 'శ్రీ కృష్ణ, యతీంద్ర రామానుజ జియ్యంగార్ల పుత్రుడు. వారి ఉన్నతికి వారసత్వ సంస్కారమే కారణమైందనుకుంటా. ఇంతటి పండితుల పుస్తకాలను ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.



## అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజానావ, హుస్నాబాద్:** అపరిచిత వ్యక్తుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ ఏఎస్ఐ మల్లేశం అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీమ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్, నూతన చట్టాలు, మహిళా చట్టాలు, షీ టీమ్స్ ప్రాముఖ్యత, ఫోక్సో, బాల్య వివాహాలు, పరిణామాలు, సోషల్ మీడియా, సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, డయల్ 100 ప్రాముఖ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మల్లేశం మాట్లాడుతూ మనిషి జీవితంలో విద్యార్థి దశ కీలకమైనదని, చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రస్తుత కాలంలో సమాజంలో జరుగుతున్న కొన్ని సంఘటనలు వాటికి విధించే శిక్షలను గురించి వివరించారు. గంజాయి, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరండా ఉంటూ క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. సమాజంలో ఎవరైనా ఎప్పుడైనా వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100కు సంప్రదించి పోలీసులు సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయ బృందంతో పాటు షీ టీమ్ బృదం సదయ్య, ప్రశాంతి, కానిస్టేబుల్ కృష్ణతో పాటు తదితరులున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



**ప్రజానావ, కరీంనగర్:** నగర శివారులోని చింతకుంట మల్కాపురం రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని ఘటన స్థలాన్ని పరిశీలించారు. వారి కథనం ప్రకారం.. గురువారం తెల్లవారుజామున మల్కాపూర్ సమీపంలో రోడ్డు పక్కన కొంత దూరంలో ఇద్దరి ముద్దేహాలు పడి ఉన్నాయని, ఇద్దరు యువకులు తీవ్ర గాయాలతో మృతి చెంది ఉండడం గమనించిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత యువకులు అతివేగంగా వెళ్తూ చెట్టుని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగి మృతి చెంది ఉంటారని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు చెప్పారు. మృతులిద్దరూ నగరంలోని వావిలాలపల్లికి చెందిన అభిషేక్, సుభాష్ నగర్ కు చెందిన బండారి రాజ్ కుమార్ గా గుర్తించారు. యువకుల కుటుంబ సభ్యుల సమాచారం ఇచ్చి సంఘటన స్థలం నుంచి యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొట్టారా లేక ఏదైనా వాహనం ఢీ కొట్టిందా అనే కోణంలో విచారిస్తామని పేర్కొన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి ఎస్ఐ సామమూర్తి తెలిపారు.

## ఘనంగా నేతాజీ జయంతి వేడుకలు
# నివాళులర్పించిన మేయర్



**ప్రజానావ, కరీంనగర్:** సుభాష్ చంద్రబోస్ దేశాలు తిరిగి ఆయుధాలను సమకూర్చి ప్రత్యేక సైన్యం ఏర్పాటు చేసి స్వాతంత్ర్య పోరాటం చేసిన మహనీయులని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సుభాష్‌నగర్‌లో ఆయన విగ్రహానికి గురువారం నగర మేయర్ యాదగిరి సునీల్ రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర్య పోరాటంలో దేశం కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్ సంస్థను స్థాపించి... స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ రాజ్ కి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు. ఇంతటి పోరాట పటిమను చూపిన సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో ఆ రోజుల్లో స్వాతంత్ర్య పోరాటాలు చేసి మన దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టారన్నారు. ఇలాంటి మహనీయుల జయంతి, వర్ధంతిలను జరుపుకొని స్మరించుకోవడం, పోరాటాలను గుర్తు చేసుకోవడం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అర్ష కిరణ్మయి మల్లేశం, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన తప్పనిసరి

**ప్రజానావ, బెజ్జంకి:** రోడ్డు భద్రతపై వాహనదారులు అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ప్రమాదాలను నివారించడానికి అవకాశం ఉంటుందని బెజ్జంకి ఎస్సై జె. క్రిష్ణారెడ్డి తెలిపారు. ప్రమాద రహిత సమాజాన్ని నిర్వహించడమే ముఖ్య ఉద్దేశ్యమని, మానవ తప్పిదాలతోనే 85 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనదారులు తప్పనిసరి హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.




## ఘనంగా రాజ్యాంగ దినోత్సవం వేడుకలు



**ప్రజానావ, గన్నేరువరం:** సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ గన్నేరువరం మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేశ్ ఆధ్వర్యంలో ఎస్సీ బస్తీల్లో గురువారం సమావేశం నిర్వహించారు. గన్నేరువరం మండల జగపల్లి గ్రమంలో డా. అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించి రాజ్యాంగం గొప్పతనాన్ని , అంబేద్కర్ ఆశయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా, కాసింపేట్ ఎంపీటీసీ ఏలేటి చంద్రారెడ్డి, విలాసాగరం రామచంద్రం, అరికాంతపు అనిల్, ఆటకం రామచంద్రం, పంబల రాజశేఖర్, లక్ష్మంపతి సురేందర్, నరేశ్, ఆంజనేయులు, శ్రీనివాస్, పుల్లల రాము, బండి తిరుపతి, కూన మహేశ్, మచ్చ బాలరాజు, వేణు, కూర హరీష్, గట్టు కిషన్, వినయ్, బుర్ర చంద్రశేఖర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణ కాలనీలో నేతాజీ జయంతి



**ప్రజానావ, కరీంనగర్:** స్వాతంత్ర్య సమర యోధుడు, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాన్ని తిమ్మాపూర్ మండలం రామక్రిష్ణకాలనీలోని సుభాష్ నగర్ లో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక యువ నాయకులు కొమ్మెర రాంరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
శుక్రవారం
24 జనవరి 2025



# ఆటగాళ్లకు స్వేచ్ఛ ఇవ్వడంలో
# గంభీర్ ముందుంటాడు

- అందుకే అన్ని విభాగాల్లో రాణించాం
- అద్భుతమైన రికార్డు సాధించిన అర్ష్‌దీప్‌సింగ్‌కు శుభాకాంక్షలు
- టీమ్ఇండియా కెప్టెన్ సూర్యకుమార్




**కోల్‌కతా:** భారత యువ జట్టు అద్భుతం చేసింది. ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో 1–0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తొలి మ్యాచ్‌లో పర్యటక జట్టును బెంబేలెత్తిస్తూ బ్యాటింగ్, బౌలింగ్‌లో టీమ్ఇండియా రాణించింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కుర్రాళ్లకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. మ్యాచ్ అనంతరం సూర్య మాట్లాడుతూ అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తిపై ప్రశంసల జల్లు కురిపించాడు.

"టాస్ నెగ్గినప్పటి నుంచి మ్యాచ్ ముగిసేవరకూ ఒకే ఎనర్జీ కొనసాగించాము. తొలుత ప్రణాళికలకు అనుగుణంగానే బౌలింగ్ సాగింది. లక్ష్య ఛేదనలో అలవోకగా ఆడేశాం. ఈ మ్యాచ్‌కు ముగ్గురు స్పిన్నర్లను తీసుకోవడానికి ఓ కారణముంది. పిచ్ పరిస్థితిని బట్టి ఇలా చేశాం. దక్షిణాఫ్రికాలోనూ ఇదే విధంగా ఆడాం. ముగ్గురు స్పిన్నర్లూ అద్భుతంగా రాణించారు. కొత్త బంతితో హార్దిక్ బౌలింగ్ చేసేందుకు ముందుకు వచ్చాడు. దీంతో అదనంగా స్పిన్నర్‌ను తీసుకున్నాం. వరుణ్ చక్రవర్తి పరిస్థితులకు తగ్గట్లు వేగంగా అలవాటుపడతాడు. అద్భుతమైన రికార్డు సాధించిన అర్ష్‌దీప్ సింగ్‌కు శుభాకాంక్షలు. కొత్త బంతితో బౌలింగ్ చేయాల్సి ఉంటుందని.. ఆ తర్వాత హార్దిక్ వస్తాడని అర్ష్‌కు తెలుసు. రెగ్యులర్‌గా చేసేదానికి అదనంగా బాధ్యతలు తీసుకొనేందుకు ముందుకు రావడం అభినందనీయం. ఆటగాళ్లకు స్వేచ్ఛ ఇవ్వడంలో గౌతమ్ గంభీర్ ముందుంటాడు. ఫీల్డింగ్‌లోనూ మెరుగ్గా రాణించాం. ఆ విభాగం కోచ్‌తో కలిసి చాలా శ్రమించాం. మైదానంలో ఎప్పుడూ ఉత్సాహంగా ఉండాలని మాత్రమే మా నుంచి అతడు కోరుకున్నాడు" అని సూర్య వెల్లడించాడు.

### ఇలా అవుతుందని ఊహించలేదు: బట్లర్

"పిచ్‌ను అర్థం చేసుకోవడంలో మా బ్యాటర్లు కాస్త ఇబ్బంది పడ్డారు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ ఇలాంటి ప్రదర్శనను ఊహించలేదు. త్వరగా వికెట్లను కోల్పోవడం నష్టపరిచింది. ఈడెన్ గార్డెన్స్ పిచ్ పొరపాటేమీ లేదు. భారత బౌలర్లు పరిస్థితులను సద్వినియోగం చేసుకున్నారు. లోపాలను సరిదిద్దుకొని తర్వాత మ్యాచ్‌లో విజయం సాధించేందుకు ప్రయత్నిస్తాం. జోఫ్రా ఆర్చర్ నాణ్యమైన బౌలింగ్‌తో ఫామ్‌లోకి రావడం మాత్రం ఆనందంగా ఉంది. మార్క్‌వుడ్ వేగవంతమైన బౌలర్. ఈసారి కూడా అతడి స్పీడ్ అద్భుతం. దూకుడుగా ఆడే భారత్‌ను అడ్డుకోవాలంటే ఏ చిన్న ఛాన్స్‌ను మిస్ చేసుకోకూడదు. కోచ్ మెక్‌కల్లమ్‌తో పనిచేయడాన్ని ఆస్వాదిస్తున్నా. అతడికి నేను అతిపెద్ద అభిమానిని. ఇప్పుడు డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకోవడం బాగుంది" అని ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ వ్యాఖ్యానించాడు.

## శ్రీలంకను చిత్తు చేసిన భారత్

### అండర్-19 మహిళల టీ20 ప్రపంచ కప్



**కౌలాలంపూర్:** అండర్–19 మహిళల టీ20 ప్రపంచ కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ జైత్రయాత్ర కొనసాగుతోంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంకను భారత్ 60 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించి టోర్నీలో వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. తెలుగమ్మాయి గొంగడి త్రిష (49) త్రుటిలో హాఫ్ సెంచరీ మిస్ చేసుకుంది. అనం తరం లక్ష్యఛేదనకు దిగిన శ్రీలంక.. భారత బౌలర్ల ధాటికి 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 58 పరుగులకే పరిమితమైంది. లంక టాప్–5 బ్యాటర్లలో ఒక్కరూ రెండంకెల స్కోరు చేయ లేదు. ఆరో స్థానంలో వచ్చిన రష్మిక సెవ్వండి (15) టాప్ స్కోరర్. టీమ్ఇండియా బౌలర్లలో షబ్నమ్ 2, జోషిత 2, పరుణికా సిసోధియా 2, ఆయుషి శుక్లా, వైష్ణవి శర్మ ఒక్కో వికెట్ పడగొట్టారు. భారత బ్యాటర్లలో ఓపెనర్ త్రిష మినహా ఎవరూ పెద్ద స్కోర్లు చేయలేదు. కెప్టెన్ నిక్కి ప్రసాద్ (11), మిథిలా వినోద్ (16), జోషిత (14) రన్స్ చేశారు. కమలిని (5), భవికా (7), ఆయుషి (5) నిరాశపర్చారు. లంక బౌలర్లలో ప్రముది, ఏసేని తలగునె, లిమాన్స తిలకరత్న రెండేసి వికెట్లు పడగొట్టగా.. రష్మిక, చామోడి ప్రభోద, మనుడి నానయక్కర ఒక్కో వికెట్ తీశారు.



## వారి కోచింగ్‌లో రాటుదేలాను : అభిషేక్ శర్మ

**కోల్‌కతా:** ఐదు టీ20ల సిరీస్‌లో భారత యువ బ్యాటర్ అభిషేక్ శర్మ (79) తొలి మ్యాచ్‌లోనే విశ్వరూపం చూపించాడు. శ్రీలంకతో టీ20 సిరీస్‌లో పెద్దగా ప్రభావం చూపించని అతడు ఈసారి మాత్రం వచ్చిన అవకాశాన్ని అందుకొన్నాడు. కోచ్, కెప్టెన్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాపాడుకొన్నట్లు వెల్లడించిన అభిషేక్.. తన బ్యాటింగ్‌లో మెరుగైన ప్రదర్శనకు ముగ్గురి కోచింగ్ దోహదం చేసిందన్నాడు. అందులో చిన్నప్పటి నుంచి ఇష్టపడిన యువరాజ్ సింగ్ ఉన్నాడని వ్యాఖ్యానించాడు. ఎస్‌ఆర్‌హెచ్ తరఫున ఆడటం కూడా కలిసొచ్చిందని తెలిపాడు. "యువరాజ్ సింగ్‌తో ఎప్పట్నుంచో కలిసి పని చేస్తున్నా. ఆ తర్వాత బ్రియాన్ లారాతో వర్క్ చేశా. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున కోచ్‌గా ఉన్నప్పుడు నాకు చాలా సాయం చేశాడు. డానియల్ వెట్టోరి కోచింగ్‌లోనూ నా నైపుణ్యాలను మెరుగుపర్చుకున్నా. స్వేచ్ఛగా ఆడమని మాత్రమే చెబుతాడు. షాట్లు కొట్టేటప్పుడు దానిని పాటిస్తా. యువరాజ్, బ్రియాన్ లారా తర్వాత ఇప్పుడు గౌతమ్ గంభీర్ సూచనలు నాపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఎలా ఆడినా నాకు మద్దతుగా నిలిచారు. మెరుగైన ప్రదర్శన చేసేందుకు అవసరమైన సూచనలు ఇస్తారు" అని అభిషేక్ వెల్లడించాడు.

### యువరాజ్ నుంచి స్పెషల్ పోస్టు

ఇంగ్లండ్‌పై అద్భుత విజయం సాధించిన భారత జట్టుపై యువరాజ్ సింగ్ ప్రశంసల వర్షం కురిపించాడు. దూకుడైన ఇన్నింగ్స్ ఆడిన అభిషేక్‌ను అభినందించాడు. ఈ మేరకు తన సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా పోస్టు పెట్టాడు. "అబ్బాయిలూ మంచి ఆరంభం చేశారు. మన బౌలర్లు అదరగొట్టారు. అద్భుతంగా ఆడారు. అభిషేక్ శర్మ.. అత్యుత్తమ ఇన్నింగ్స్‌తో మెప్పించావు" అని పోస్టు చేశాడు. మెరుపు ఇన్నింగ్స్‌తో టీ20ల్లో ఇంగ్లాండ్‌పై భారత్ తరఫున రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీ చేసిన ఆటగాడిగా అభిషేక్ నిలిచాడు. కేవలం 20 బంతుల్లోనే అర్ధశతకం చేశాడు. ఈ క్రమంలోనే కేఎల్ రాహుల్ (27 బంతులు) రికార్డును బ్రేక్ చేశాడు. 2018లో మాంచెస్టర్‌లో జరిగిన టీ20లో ఇంగ్లాండ్‌పై రాహుల్ 27 బంతుల్లోనే అర్ధ శతకం చేశాడు. ఈ జాబితాలో యువరాజ్ సింగ్ (12 బంతుల్లో) అగ్రస్థానంలో ఉన్నాడు. 2007 టీ20 ప్రపంచ కప్‌లో యువీ ఈ ఫీట్ సాధించాడు.




## ఛాంపియన్స్ ట్రోఫీలో మా బ్రాండ్ క్రికెట్ చూపిస్తాం : హార్దిక్ పాండ్య

**కోల్‌కతా:** ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. దుబాయ్ వేదికగా భారత్ మ్యాచ్‌లు జరగనున్నాయి. చివరిసారిగా 2013లో టీమ్ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచింది. అప్పుడు ఎంఎస్ ధోనీ నాయకత్వం వహించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రోహిత్ శర్మ సారథ్యంలో భారత్ బరిలోకి దిగనుంది. ఈ క్రమంలో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ఆసక్తి కర వ్యాఖ్యలు చేశాడు. భారత్ బ్రాండ్ క్రికెట్‌ను ఛాంపియన్స్ ట్రోఫీలో ప్రదర్శించేందుకు సిద్ధంగా ఉన్నామన్నాడు. ఐసీసీ లాంచ్ చేసిన 'ఆల్ ఆన్ ది లైన్' క్యాంపెయిన్‌లో పాండ్య, ఇంగ్లండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్, నబీ, షహీన్ మాట్లాడారు. ఆ వీడియోను ఐసీసీ షేర్ చేసింది. "ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని ఎనిమిదేళ్ల తర్వాత నిర్వహించనుండటం క్రికెట్‌కు బూస్టింగ్‌లాంటిది. వన్డే ఫార్మాట్‌కు మరింత వన్నె తీసుకొస్తుందని భావిస్తున్నా. ఈ ఐకానిక్ టోర్నీ కోసం అభిమానులతోపాటు ప్లేయర్లం కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం. భారత్ కూడా సిద్ధంగా ఉంది. మా బ్రాండ్ క్రికెట్‌ను ప్రదర్శించాలని ప్రతి క్రికెటర్ ఉవ్విళ్లూరుతున్నాడు" అని పాండ్య తెలిపాడు.




## వాంఖడే స్టేడియంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు

**ముంబై:** ముంబై క్రికెట్ అసోసియేషన్.. గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నది. వాంఖడే స్టేడియంలో క్రికెట్ బంతులతో .. 50 ఏళ్ల వార్సికోత్సవాన్ని జరుపుకున్నది. స్టేడియంలో 14,505 బంతులతో.. ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ వాంఖడే స్టేడియం అని రాసింది. దీని కోసం ఎరుపు, తెలుపు బంతుల్ని వాడింది. 1975లో వెస్టిండీస్‌తో వాంఖడే స్టేడియంలో తొలి అంతర్జాతీయ టెస్టు మ్యాచ్ జరిగింది. 14 వేల క్రికెట్ బంతులతో 50 ఏళ్ల వార్షికం సందర్భంగా ప్రదర్శన ఇచ్చారు. ఎంసీఏ ప్రెసిడెండ్ అజింక్య నాయక్ దీనిపై సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. మాజీ ప్లేయర్ ఏకనాథ్ సోల్కర్‌తో పాటు మాజీ ముంబై ఆటగాళ్ల స్మారకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. 1975లో జరిగిన మ్యాచ్‌లో సోల్కర్ సెంచరీ నమోదు చేశాడు. ఆ ఏడాది జనవరి 23 నుంచి 29 వరకు ఆ మ్యాచ్ జరిగింది. స్కూళ్లు, క్లబ్‌లు, ఎన్జీవోలకు చెందిన యువ క్రికెటర్లకు ఆ బంతుల్ని కానుకగా ఇవ్వనున్నట్లు ఎంసీఏ ప్రెసిడెంట్ తెలిపారు.

# రంజీ ట్రోఫీలో అదరగొట్టిన జడేజా

### స్టార్ ఆటగాళ్లు విఫలం..





రుతురాజ్ గైక్వాడ్ (10) విఫలమయ్యాడు.

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మకమైన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ముంగిట ఫామ్‌ను అందిపుచ్చుకోవడానికి రంజీ ట్రోఫీ బరిలో నిలిచిన భారత స్టార్ క్రికెటర్లు నిరాశపర్చారు. రవీంద్ర జడేజా తప్ప మిగతా స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్ రాణించలేదు. ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో సౌరాష్ట్ర ఆల్‌రౌండర్ జడ్డూ ఆకట్టుకున్నాడు. బౌలింగ్‌లో జడేజా (5/66)తో మెరవడంతో ఢిల్లీ 188 పరుగులకు ఆలౌటైంది. ఆయుష్ బదోని (60), యశ్ ధుల్ (44), మయాంక్ గుసైన్ (38) రాణించగా.. రిషభ్ పంత్ (1) నిరాశపర్చాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌరాష్ట్ర మొదటి రోజు ఆట ముగిసేసరికి 5 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసి తొలి ఇన్నింగ్స్‌లో 25 రన్స్ వెనుకంజలో ఉంది. హార్విక్ దేశాయ్ (93బీ 120 బంతుల్లో) సెంచరీకి కొద్దిదూరంలో ఔటయ్యాడు. జడేజా (38బీ 36 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు. ఇంకా ఐదు వికెట్లు చేతిలో ఉండటంతో మిగతా ఆటగాళ్లు రాణిస్తే సౌరాష్ట్ర మంచి ఆధిక్యం సాధించే అవకాశముంది.

### స్టార్ ఆటగాళ్లు విఫలం.. 120కే ఆలౌటైన ముంబయి

జమ్ము కశ్మీర్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో రోహిత్ ప్రాతినిధ్యం వహిస్తున్న ముంబయి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 120 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లుగా వచ్చిన రోహిత్ (3), యశస్వి జైస్వాల్ (4) ఘోరంగా విఫలమయ్యారు. కెప్టెన్ రహానె (12), శ్రేయస్ అయ్యర్ (11) కూడా నిరాశపర్చారు. శివమ్ దూబె డకౌటయ్యాడు. శార్దూల్ ఠాకూర్ (51బీ 57 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించకపోతే ఆ జట్టు పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి జమ్ము కశ్మీర్ 7 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆ జట్టు 54 రన్స్ ఆధిక్యంలో నిలిచింది. శుభమ్ ఖజురియా (53), అబిద్ ముస్తాక్ (44) రాణించారు. అబ్దుల్ సమద్ (19) పరుగులు చేశాడు. బరోడాతో జరుగుతున్న మ్యాచ్‌లో మహారాష్ట్ర తొలి రోజు ఆట ముగిసేసరికి 7 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. కెప్టెన్

### పంజాబ్ 55 ఆలౌట్.. భారీ ఆధిక్యం దిశగా కర్ణాటక

కర్ణాటకతో జరుగుతున్న మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని పంజాబ్ కేవలం 55 పరుగులకే కుప్పకూలింది. గిల్ (4) ఇలా వచ్చి అలా వెళ్లిపోయాడు. ఆ జట్టులో రమణ్‌దీప్ సింగ్ (16) టాప్ స్కోరర్. తొలి రోజు ఆటముగిసే సమయానికి కర్ణాటక 4 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసి 144 రన్స్ ఆధిక్యంలో ఉంది. స్మరన్ రవిచంద్రన్ (83లి), అభినవ్ మనోహర్ (1లి) క్రీజులో ఉన్నారు.

### తన్మయ్, షేక్ రషీద్ సెంచరీలు..

హిమచల్‌ప్రదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ భారీ దిశగా దూసుకుపోతోంది. మొదటి రోజు ఆట ముగిసేసరికి 2 వికెట్లు కోల్పోయి 291 పరుగులు చేసింది. ఓపెనర్లు తన్మయ్ అగర్వాల్ (137లి), అభిరత్ రెడ్డి (73) తొలి వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. రోహిత్ నాయుడు (52) అర్ధ శతకం చేశాడు. తన్మయ్‌తోపాటు వరుణ్ గౌడ్ (21లి) క్రీజులో ఉన్నాడు. పాండిచ్చేరితో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్రా మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 7 వికెట్ల నష్టానికి 245 రన్స్ చేసింది. గుంటూరు కుర్రాడు షేక్ రషీద్ (105) శతకంతో సత్తాచాటాడు. శ్రీకర్ భరత్ (19) పరుగులు చేసి వెనుదిరిగాడు.

# రిటైర్మెంట్ గురించి మాట్లాడిన రష్మిక..



బాలీవుడ్ హీరో విక్కీ కౌశల్, స్టార్ హీరోయిన్ రష్మిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఛావా'. పీరియాడిక్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ముంబయిలో దీని ట్రైలర్ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. అందులో రష్మిక రిటైర్మెంట్ గురించి సరదాగా మాట్లాడారు. ప్రస్తుతం ఆ కామెంట్స్ వైరల్‌గా మారాయి. "ఈ సినిమాలో శంభాజీ భార్య ఏసుబాయిగా నటించే అవకాశం రావడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. ఒక నటిగా నాకు ఇంతకు మించి ఏం కావాలి. ఈ సినిమా తర్వాత నేను సంతోషంగా రిటైర్ అవ్వగలను అని దర్శకుడితో ఒక సందర్భంలో చెప్పాను. అంత గొప్ప పాత్ర ఇది. దీని షూటింగ్ సమయంలో ఎన్నో సార్లు భావోద్వేగానికి గురయ్యా. ట్రైలర్ చూశాక కూడా ఎమోషనల్ అయ్యా. విక్కీ కౌశల్ ఇందులో నాకు దేవుడిలా కనిపిస్తున్నాడు. ఈ సినిమా కోసం డైరెక్టర్ లక్ష్మణ్ ఉటేకర్ నన్ను సంప్రదించినప్పుడు ఆశ్చర్యపోయా. ఏమీ ఆలోచించకుండా వెంటనే అంగీకరించా. ఈ పాత్ర కోసం ఎన్నో రిహార్సల్స్ చేశా. టీమ్ అంతా ఎంతో సహకరించింది. ఇందులోని పాత్రలు అందరినీ ప్రభావితం చేస్తాయి" అని రష్మిక చెప్పారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవితం ఆధారంగా లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన చిత్రమే 'ఛావా'. ఇందులో శంభాజీ భార్య ఏసుబాయిగా రష్మిక కనిపించనున్నారు. తాజాగా విడుదల చేసిన దీని ట్రైలర్‌కు మంచి ప్రేక్షకాదరణ వచ్చింది. "సింహం లేకుండా ఉండొచ్చు కానీ.. ఆ సింహానికి పుట్టిన ఛావా ఇంకా బతికే ఉంది.. మరాఠాలను సవాలు చేయడానికి ధైర్యం చేస్తే మొఘల్ సామ్రాజ్యాన్నే లేకుండా చేస్తాం.." అంటూ సాగే డైలాగ్స్ ఆకట్టుకుంటున్నాయి. రష్మిక ఇటీవల గాయపడిన విషయం తెలిసిందే. జిమ్‌లో వర్కౌట్లు చేస్తుండగా ఆమె కాలికి గాయమైంది. ముంబయిలో జరిగిన ఛావా ట్రైలర్ రిలీజ్‌కు ఆమె గాయంతోనే వెళ్లారు. వేదికపై రష్మిక నడవడానికి విక్కీ సాయం చేశారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి.



# నేను మొత్తం వైట్‌లోనే తీసుకుంటా

## - హీరో వెంకటేశ్

దేవుడు జీవితంలో ఏదిచ్చినా తీసుకోవాలని, అప్పుడే సంతోషంగా ఉంటామని అగ్ర కథానాయకుడు వెంకటేశ్ అన్నారు. చిరంజీవితో సినిమా చేయాలని ఉంటే, తప్పకుండా జరుగుతుందని అన్నారు. వెంకటేశ్ కీలక పాత్రలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి కథానాయికలు. సంక్రాంతి పండగ కానుకగా వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పటివరకూ రూ.230 కోట్లు వసూలు చేసినట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్, అనిల్ రావిపూడి, సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో పాల్గొన్నారు.

'నా అభిమానులకు ఒక్కటే చెబుతా. అందరూ సంతోషంగా ఉండండి. జీవితంలో మీకు ఏది వస్తే దాన్నే తీసుకోండి. నేనెప్పుడూ ఇది కావాలని అడగను. దేవుడు ఇచ్చింది తీసుకుంటా. ఈ మూవీ సక్సెస్ నాకు బోనస్. అనిల్ రావిపూడితో భవిష్యత్‌లోనూ సినిమాలు చేస్తా. అదే సమయంలో కథ కూడా బాగుండాలి. ప్రేక్షకులతో నిజాయతీగా లేకపోతే ఒప్పుకోరు. కుటుంబ కథా చిత్రం చేయాలనుకున్నప్పుడు అనిల్ చెప్పిన కథ నచ్చింది. మా అంచనాలు నిజం చేస్తూ ప్రేక్షకులు దాన్ని మరో స్థాయికి తీసుకెళ్లారు. ఇప్పటివరకూ చేయని ఎక్స్‌ప్రెషన్స్ ఈ మూవీలో ప్రయత్నించాం. థియేటర్‌లో అది ఎక్కడికో వెళ్లిపోయింది. అదొక అద్భుతశక్తి. ఆ శక్తిని నేను గౌరవిస్తా" ఇండస్ట్రీలోని ప్రముఖులపై ఐటీ రైడ్స్ జరుగుతున్నాయి కదా మీరేమంటారు? అని వెంకటేశ్‌ను ప్రశ్నించగా, "ఐటీ రైడ్స్ జరుగుతున్నాయా? నిజమా? మిగతా వాళ్ల గురించి నాకు తెలియదు. నేను నా పారితోషికం మొత్తం వైట్‌లో తీసుకుంటా. నేను వైట్‌లో వైట్. అయినా నేను తీసుకునే రెమ్యునరేషన్ కూడా తక్కువే కదా! అనిల్‌లో మంచి ఎనర్జీ ఉంది. అది నాకు నచ్చింది. రచయిత కావడం వల్ల ఎప్పటికప్పుడు సరికొత్త ఫన్ యాడ్ చేసుకుంటూ వెళ్తాడు. నేను అనుకోకుండా సినిమాల్లోకి వచ్చా. కష్టపడి పనిచేయడమే నాకు తెలుసు. అప్పుడప్పుడు ఫెయిల్యూర్స్ వస్తాయి. అన్నింటినీ యాక్సెప్ట్ చేయాలి. కుదిరిన ప్రతి సినిమాకు నా వంతు ప్రచారం చేస్తా. ఐశ్వర్య రాజేశ్‌తో కలిసి పనిచేయడం బాగుంది. ఆమె మంచి నటి. 'రానా నాయుడు'లో నా డైలాగ్స్, యాక్టింగ్ వల్ల పిల్లలేమీ చెడిపోలేదు. అయినా మీకోసం 'సీజన్2'లో ఆ మోతాదు తగ్గించాం. అంత ఉండదు" అని వెంకటేశ్ అన్నారు.

### ఆ మిరాకిల్ ఈ మూవీకి జరిగింది: అనిల్ రావిపూడి

ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. "వెంకటేశ్‌గారు సక్సెస్/ఫెయిల్యూర్ దేనినైనా చాలా కూల్‌గా తీసుకుంటారు. అది నేనిప్పుడు నేర్చుకుంటున్నా. గత రెండు మూడేళ్లుగా ఫ్యామిలీ జానర్‌లో పెద్దగా సినిమాలు రాలేదు. దాంతో ఇన్నేళ్లు థియేటర్‌కు రాని వాళ్లంతా వచ్చి మా మూవీ చూస్తున్నారు. ఒక్కో చోట పాతిక టికెట్లు కూడా ఒకేసారి తెగుతున్నాయి. మా ఫ్రెండ్ వాళ్లమ్మ సినిమా చూసి 30ఏళ్లు అయిందట. ఆవిడ వచ్చి సినిమా చూసి సంతోషం వ్యక్తం చేశారు. అలాంటి మిరాకల్ ఈ మూవీకి జరిగింది. రెండోసారి సినిమా చూసేవాళ్లు కూడా పెరుగుతారని అనిపిస్తోంది" "మా స్నేహితుడు ట్విటర్‌లో నన్ను కోట్ చేస్తూ, 'ఐటీ రైడ్స్ జరిగే స్థాయికి వెళ్లిపోయావు' అని అన్నాడు. నాపై ఎలాంటి రైడ్స్ జరగలేదు. కామెడీ ప్రధానంగా సాగిన సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద ఘన విజయాలు సాధించిన సందర్భాలు ఉన్నాయి. సినిమా టికెట్ రేట్లు పెంచకుండా మంచి కలెక్షన్లు రాబట్టడం అన్నది సినిమాను బట్టి ఉంటుంది. భీమ్స్‌తో ఎప్పటి నుంచో కలిసి పనిచేయాలనుకున్నా. మనకు ఒక ట్యూన్ నచ్చకపోతే, అంతే వేగంగా ఇంకొక ట్యూన్ ఇచ్చేస్తాడు. ఇక ఇండస్ట్రీలో భీమ్స్ టైమ్ మొదలైంది. మరో ఐదారేళ్లు అతడి హవా కొనసాగనుంది. నేను తర్వాత చేయబోయే సినిమా నాకు 9వది. అది స్పెషల్. రెండు, మూడు వారాల్లో దాని గురించి నేనే అధికారికంగా చెబుతా. ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రాలకు నిడివి ప్రధానం. మాస్ కమర్షియల్ అయితే, 2 గంటలా 35 నిమిషాలకు కాస్త అటు ఇటూ ఉండేలా చూసుకుంటా. కేవలం ఎంటర్‌టైన్‌మెంట్ అయితే, 2 గంటల 20-25 నిమిషాలు ఉండేలా కట్ చేస్తా. థియేటర్‌కు వచ్చామా? చూశామా? వెళ్లామా? అన్నట్లు ఉండాలి" సీక్వెల్ ఉంది కాబట్టి, ఆ పాత్రను ఇంకా పెంచే ప్రయత్నం చేస్తాం. ఈ సినిమాలో డార్క్ హ్యూమర్ 30-40శాతం ఉండేలా డిజైన్ చేసుకున్నాం. ఈ సినిమా సీక్వెల్ అనుకున్నప్పుడు పూర్తి స్థాయిలో చేస్తాం. ఈ మూవీ థియేట్రికల్ రన్ పూర్తయిన తర్వాత జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది" అని అనిల్ అన్నారు.

### ఈ సినిమాతో ప్రతి ఇంటికీ వెళ్లా: భీమ్స్ సిసిరోలియో

'గ్రంథాలయానికి వెళ్తే చాలా పుస్తకాలు ఉంటాయి. ఒక్కొక్కటీ ఒక్కో అంశాన్ని చెబుతుంది. కానీ, అనిల్ రావిపూడితో కలిసి పనిచేయడం వల్ల చాలా విషయాలు తెలిశాయి. చిన్న చిన్న పదాలతో ఎలా మేజిక్ చేయవచ్చో తెలిసింది. ఇప్పటివరకూ నేను చేసిన ప్రతి పాట నా బిడ్డే. 'సంక్రాంతికి వస్తున్నాం' మాత్రం అమ్మలాంటి జ్ఞాపకం. నేను ఇండస్ట్రీకి వచ్చి 24ఏళ్లు అయింది. ఇన్నేళ్లలో ఏం చేశామంటే, రెండు, మూడు పాటలు మాత్రమే తెలుసు. ఈ సినిమాతో ప్రతి ఇంటికీ వెళ్లాను. పబ్లిసిటీ నాకు పెద్దగా నచ్చదు. పాట పక్షిలాంటిది మాట మనిషిలాంటిది" అని భీమ్స్ చెప్పారు.

# మరో వెబ్ సిరీస్‌లో సమంత


తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న భామల్లో ఒకరు సమంత. సిటాడెల్ వెబ్ ప్రాజెక్ట్‌తో బిజీగా మారిన ఈ బ్యూటీ.. విడుదల తర్వాత రిలాక్సేషన్ మూడ్‌లోకి వెళ్లిపోయింది. సమంత క్రిస్మస్, న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం యూఎస్ టూర్‌లో ఉన్న విషయం తెలిసిందే. యూఎస్‌లో తన వర్కవుట్ సెషన్‌తోపాటు ఇతర కార్యకలాపాల గురించి అప్‌డేట్స్‌ను నెట్టింట షేర్ చేసుకుంది. అయితే సామ్ తన లాంగ్ ట్రిప్ వెకేషన్ ముగించుకొని ఇండియాకు తిరిగొచ్చేసింది. బుధవారం చెన్నై, ముంబైలో జరిగిన ఈవెంట్స్‌లో పాల్గొన్నది. చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో వరల్డ్ పికిల్‌బాల్ లీగ్ కోసం చెన్నై సూపర్ చాంప్స్ జెర్సీని లాంచ్ చేసింది. ఈవెంట్ ముగిసిన తర్వాత ముంబైకి పయనమైంది. మళ్లీ చాలా కాలం తర్వాత తన కొత్త వెబ్ సిరీస్ వెబ్ సిరీస్ షూట్‌లో జాయిన్ అయింది. ఇప్పుడీ అప్‌డేట్‌తో ఫుల్ ఖుషీ అవుతున్నారు సామ్ అభిమానులు. విజయ్ దేవరకొండతో చివరగా ఖుషి సినిమాలో నటించింది సమంత. ఈ సినిమా తర్వాత తెలుగులో మళ్లీ కొత్త ప్రాజెక్టు ప్రకటించలేదు.





# ఏజ్ అనేది ఇండస్ట్రీలో సమస్య కాదు: మనీషా కొయిరాలా

వయసు అనేది ఇండస్ట్రీలో ఒక సమస్య కాదని సీనియర్ నటి మనీషా కొయిరాలా అన్నారు. సీనియర్ నటీమణులు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. జీవించి ఉన్నంత వరకు సంతోషంగా, సంతృప్తిగా ఆరోగ్యంగా ఉండాలనకుంటున్నట్లు తెలిపారు. "ఇండస్ట్రీలోని సీనియర్ నటీమణులకు ముఖ్యమైన పాత్రలు ఇవ్వాలి. వృద్ధాప్యం అనేది వినోద పరిశ్రమలో ఒక సమస్య కాదు. కానీ, ఇది పరిష్కరించాల్సిన సామాజిక సమస్య. ఎందుకంటే హీరోల వయసు గురించి ఎవరూ కామెంట్స్ చేయడం నేను వినలేదు. ఈ విషయంలో మహిళలనే ట్రోల్ చేస్తారెందుకు?. సినిమాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఆమెకు తల్లి, సోదరి పాత్ర ఇద్దాం అని అంటారు. కానీ, మహిళలు ఎలాంటి పాత్రలైనా చేయగలరు. యాక్షన్ పాత్రలనైనా అలవోకగా చేయగలరు. గతంలో ఎంతో మంది సీనియర్ హీరోయిన్లు దీన్ని నిరూపించారు. నేను కూడా ఎలాంటి పాత్రనైనా సవాలుగా తీసుకొని చేస్తా. ఇప్పటికీ ఇంకా కొత్త పాత్రలు చేసి నన్ను నేను నిరూపించుకోవాలనుకుంటున్నా. ఆర్టిస్టుగా ఎదగాలని కోరుకుంటున్నా. వయసు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే. 50 ఏళ్లు దాటిన తర్వాత కూడా మనం ఒక అద్భుతమైన జీవితాన్ని గడపగలం. ఏజ్ అనేది సమస్య కాదని ప్రపంచానికి చూపాలి.



# పాత్రికేయురాలిగా పూజ!

పాత్రల ఎంపికలో ప్రత్యేకతను చూపిస్తూ.. హిందీ, తమిళ చిత్రాల్లో జోరు ప్రదర్శిస్తున్న కథానాయిక పూజా హెగ్డే. ప్రస్తుతం ఆమె, బాలీవుడ్ కథానాయకుడు షాహిద్ కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'దేవా'. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రోషన్ ఆండ్రూస్ తెరకెక్కిస్తున్నారు. విడుదల సమయం దగ్గర పడుతున్న వేళ ప్రచార పర్వాన్ని వేగవంతం చేస్తోంది చిత్రబృందం. తాజాగా ఈ సినిమాలోని మోషన్ పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది. ఇందులో రౌడీ పోలీసు అధికారిగా సినీ ప్రియులను ఆకట్టుకుంటున్నారు షాహిద్. ఈ సినిమాలో ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్‌గా పూజ కనిపించనున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాల సమాచారం. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రచార చిత్రాలు ప్రేక్షకుల అంచనాలను రెట్టింపు చేస్తున్నాయి. రాయ్ కపూర్ ఫిల్మ్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది.

Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**